RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 301 మేడ్చల్ మల్కాజ్‌గిరి 22 నవంబర్ 2024 శుక్రవారం పేజీలు : 4

## బీజేపీ ఎన్నికల మిషన్ కాదు: మోదీ

న్యూఢిల్లీ: బీజేపీ ఎన్నికల మిషన్ కాదని, అలా చెప్పడం పార్టీని అవమాన పరచడమేనని, పార్టీ కార్యకర్తల కృషి, ధైర్యం ఫలితంగానే ఎన్నికల్లో గెలుపు ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జాతి కలలను తీర్మానాలుగా రూపొందించుకుని, వాటిని సాధించడం, అందుకోసం పూర్తి అంకితభావంతో పనిచేయడం చేయాలన్నారు. ఏ పార్టీని ప్రజలు అధికారంలోకి తీసుకువచ్చారో ఆ పార్టీ ప్రజాస్వామిక విలువలకు కట్టుబడుతూ, అంతర్గత ప్రజాస్వామ్యానని కాపాడుకోవాకోవాల్సి ఉంటుందన్నారు. పార్టీకి ఎన్నో తరాలవారు తమ జీవితాలను వెచ్చించారని, ఆ ఫలితమే ఈరోజు ప్రజల గుండెల్లో కమలం చిరస్థాయిగా నిలిచిందని గుర్తుచేశారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం– 'సంఘటన్ పర్వ, సదస్యత అభియాన్ 2024' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కార్యకర్తలను ఉత్సాహపరుస్తూ ప్రధాని ప్రసంగించారు.




# ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా....
# మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం..
## తేల్చి చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి!

హైదరాబాద్: మూసీ నదిని ప్రక్షాళన చేసి హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తుందని, ఎన్ని శక్తులు అడ్డుపడినా ప్రక్రియ పూర్తి చేసే బాధ్యతను కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**మూసీ ఒక వరం కావాలి..** "నదుల వెంట నాగరికత వర్ధిల్లాలి... నదులను కబళిస్తే.. మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ప్రజా ఆరోగ్యం పటిష్ఠ ఆర్థికం పర్యావరణ కోణాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్‌కు మూసీ ఒక వరం కావాలి. కానీ, శాపంగా మిగిలిపోకూడదు. మూసీ ప్రక్షాళన చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పం. ఈ తరానికే కాదు.. తరతరాలకు మేలు చేసే నిర్ణయం. ఈ నిర్ణయానికి అండగా నిలవాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ట్విట్టర్‌లో(ఎక్స్)లో సీఎం రేవంత్ ఓ పోస్ట్ చేశారు.

**ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం..** కాగా.. మూసీ పరీవాహక ప్రాంతం మురికి కూపంగా మారి.. హైదరాబాదీలకు విష వాయువులు అందిస్తుందని, దుర్భరంగా మారిన వారి జీవన విధానం మార్చేందుకు మూసీని ప్రక్షాళన చేసి, పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మూసీ వెంట నరకం అనుభవిస్తోన్న పేదవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాబోయే రోజుల్లో యాదవులకు అత్యధికంగా సీట్లు ఇస్తామని, కార్పొరేటర్లు, ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజాప్రతినిధులుగా అవకాశాలు పెంచి నాయకులుగా తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

**బుల్డోజర్లు ఎక్కించి అయినా ప్రాజెక్టును చేపడతాం..** మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును అడ్డుకోవాలని చూసేవారు కుక్కచావు చస్తారని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. బుల్డోజర్లు ఎక్కించి అయినా ప్రాజెక్టును చేపట్టి తీరతామని ప్రకటించారు. మూసీ కాలుష్యం వల్ల ఆ నది పరీవాహక ప్రాంత ప్రజలు అణుబాంబుతో కలిగే ప్రమాదం కంటే ఎక్కువ దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరంగా ఉండాల్సిన మూసీ.. శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పునరుజ్జీవంతోనే వారికి ఆ సమస్య నుంచి విముక్తి కలుగుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గంగా, సబర్మతి నదులను రూ.40 వేల కోట్లతో సుందరీకరణ చేసుకుంటే, తాను తెలంగాణ ముఖ్యమంత్రిగా మూసీ పునరుజ్జీవం చేయొద్దా? అని ప్రశ్నించారు. ప్రధాని చేసిన పనిని మెచ్చుకుంటూ.. మూసీ ప్రక్షాళనపై నకిలీ బీజేపీ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. కమీషన్ల కోసమే మూసీ ప్రాజెక్టు చేపట్టానని బీఆర్ఎస్ అంటోందని, ఈ మూసీ ప్రక్షాళన చేయకపోతే తన జన్మ దండగ అని భావోద్వేగానికి లోనయ్యారు.

"రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన చేపట్టి.. రూ. 25 వేల కోట్లు దోచుకునే ప్రయత్నం చేస్తున్నామంటున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అదానీతో అనుబంధం దేశానికే అవమానం.. అరిష్టం : కేటీఆర్



అదానీ గ్రూప్స్ అధినేత గౌతమ్ అదానీపై యూఎస్ అభియోగాలు నమోదయ్యాయి. కంపెనీ అధికారులకు లంచాలు ఇవ్వజూపడంతోపాటు ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధుల సమీకరణకు పాల్పడినట్లుగా న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆసక్తికర ట్వీట్ చేశారు. అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు.. భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన మోసగాడని విమర్శించారు. అదానీతో కాంగ్రెస్, బీజేపీ అనుబంధం దేశానికి అవమానం, అరిష్టమన్నారు. రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఎంత ఇవ్వజూపిండో, మూసీలో అదానీ వాటా ఎంతో అంటూ ప్రశ్నించారు. ఇలాంటి మోసగాడికి.. దగాకోరుకా.. తెలంగాణలో పెట్టుబడుల అనుమతులు ఎలా ఇచ్చారంటూ మండిపడ్డారు. తక్షణం అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని.. అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలు అన్నీ బయట పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఆస్తులను కొల్లగొట్టే మీ కుయుక్తులలో మీ భడే భాయ్ వాటాఎంత ? మీ అదానీ భాయ్ వాటా ఎంత? మీ హైకమాండ్ వాటా ఎంత? అంటూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా నిలదీశారు. గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్‌తో పాటు మరో ఏడుగురిపై అభియోగాలు నమోదయ్యాయి. అదానీ, అనుబంధ సంస్థలు 20 సంవత్సరాల్లో రెండు బిలియన్ డాలర్ల లాభం పొం సోలార్ పవర్ ప్లాంట్ ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు 265 మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వ జూపినట్లుగా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు.

అమెరికాతో పాటు ఇంటర్‌నేషనల్ ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధులను సమీకరించేందుకు కంపెనీ ప్రయత్నించారని అభియోగాలు మోపారు. అదానీ గ్రీన్ ఎనర్జీలో అక్రమ మార్గాల ద్వారా కంపెనీ మూడు బిలియన్ డాలర్లకుపైగా రుణాలు, బాండ్లను సేకరించినట్లుగా న్యూయార్క్ ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ మరో సివిల్ కేసు నమోదు చేసింది. యూఎస్ సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించి అదానీ గ్రీన్ ఎనర్జీ అమెరికా ఇన్వెస్టర్ల నుంచి 175 మిలియన్ డాలర్లకుపైగా సేకరించినట్లుగా ఆరోపించింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపి జరిమానాతో పాటు కంపెనీపై ఆంక్షలు విధించాలని రెగ్యులేటర్ కోరింది.

## లగచర్ల ఘటన.. పోలీసులపై హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్

హైదరాబాద్, నవంబర్ 21: లగచర్ల ఘటనలో పోలీసులపై హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా తన భర్త పట్నం నరేందర్ రెడ్డి అరెస్టు జరిగిందని పట్నం శృతి హైకోర్టులో పిటిషన్ ధాఖలు చేశారు. పోలీసులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒక వ్యక్తిని అరెస్టు చేసే సమయంలో అనుసరించాల్సిన నిబంధనలు పాటించలేదని పిటిషనర్ పేర్కొన్నారు. డీ.కే బసు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పిటిషన్‌లో శృతి పేర్కొన్నారు.



ప్రతివాదులుగా ఐజీ వి.సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ కె. నారాయణరెడ్డి, బొమ్మరాస్పేట ఇన్స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై మహమ్మద్ అబ్దుల్ రవూఫ్ పిటిషనర్ చేర్చారు.

ప్రతివాదులుగా ఉన్న పోలీసులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలంటూ పట్నం శృతి కోరారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు రేపు(శుక్రవారం) విచారించే అవకాశం కనిపిస్తోంది.

# మళ్లీ వార్తల్లోకి 'భాగ్యనగరం'




## సరిహద్దులో కాకుండా నడిబొడ్డులో ఉండటం, రక్షణపరంగా సురక్షితం, భూకంపాల జోన్‌లో లేకపోవడం,అంబేద్కర్ ప్రతిపాదించడం ప్లస్ పాయింట్లుగా అభిప్రాయం

## కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ వ్యాఖ్యలతో మళ్లీ తెరపైకి

### ఢిల్లీలో వాయు కాలుష్యం పరాకాష్ఠకు చేరుకోవడంతో నెట్టింట చర్చ

హైదరాబాద్ : దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్ ఉండాలనే చర్చ అప్పుడప్పుడు తెరపైకి రావడం కొత్తేమి కాదు. రెండో రాజధానిగా కాకుండా ఈసారి ఏకంగా దేశ రాజధానిగా హైదరాబాద్ ఉండటం అన్ని విధాలుగా యో గ్యదాయకమని తాజాగా మరోసారి చర్చకు వచ్చింది. ఈసారి ఈ చర్చకు కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ చేసిన వ్యాఖ్యలు కేంద్ర బింధువు కావడం విశేషం. దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్య కారకాలు ప్రమాద ఘంటికలు మోగిస్తోన్న నేపథ్యంలో 'ఢిల్లీ ఇంకా దేశ రాజధానిగా కొనసాగడం అవసరమా?' అని కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ తాజాగా ట్వీట్ చేశారు. 'ప్రపంచంలో రెండవ అత్యంత కలుషిత నగరమైన ఢాకా కంటే ఢిల్లీలో పరిస్థితి ఐదు ఎక్కువ. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ మారింది.

ఇక్కడ ప్రమాదకర కాలుష్య కారకాలు నాలుగు రెట్లు పెరిగాయి. నవంబర్ నుంచి జనవరి మధ్య ఈ నగరం నివాసయోగ్యం కాదు. ఇలాంటి పరిణామాల మధ్య ఢిల్లీని దేశ రాజధానిగా కొనసాగించాలా?' అని శశి థరూర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలే ప్రస్తుతం నెట్టింట దేశ రాజధానిపై చర్చకు దారితీసింది. ఢిల్లీ కాకుండా దేశ రాజధానిగా ఏది ఉంటే బాగుంటుందన్న చర్చ జోరుగా సాగుతుండగా మెజార్టి నెటిజన్లు హైదరాబాద్ అయితే బాగుంటుందని పలు కారణాలు చూపుతూ మొగ్గు చూపుతున్నారు.

**హైదరాబాద్ ఎందుకు యోగ్యకరం?...** దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్ ఉండాలన్న చర్చ స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలోనే వచ్చింది. ఈ ప్రతిపాదనను రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ స్వయంగా తెరపైకి తీసుకవచ్చారు. తన 'థాట్స్ ఆఫ్ లింగ్విస్టిక్ స్టేట్స్' అనే పుస్తకంలో హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేయాలని అంబేద్కర్ ప్రతిపాదించారు. దీనికి కొన్ని బలమైన కారణాలను కూడా ఆయన చూపారు. భారత దేశానికి శత్రు దేశాలైన పాకిస్తాన్, చైనా సరిహద్దులకు హైదరాబాద్ నగరం సుదూరంగా ఉండటం దేశ భద్రతాపరంగా అనువైన ప్రాంతమని ఆయన పేర్కొన్నారు. అలాగై హైదరాబాద్ నగరం అన్ని సీజన్లకు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంశం రాష్ట్ర విభజన సందర్భంగా చర్చకు వచ్చింది. హైదరాబాద్‌లో ఎత్తైన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు హాజరైన అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ ఆ సందర్భంగా హైదరాబాద్‌ను రెండో రాజధానిగా అంబేద్కర్ ప్రతిపాదించిన విషయాన్ని ఆయన గుర్తు చేసినప్పుడు కూడా ఈ చర్చ జరిగింది. అనంతరం మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు కూడా ఎప్పటికైనా హైదరాబాద్ దేశానికి రెండో రాజధానిగా అవుతుందన్న నమ్మకం తనకు ఉందంటూ ప్రకటన కూడా చేశారు. ఇలా అడపాదడపా హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేయాలన్న చర్చ ఎల్లప్పటికీ లైవ్‌గా కొనసాగుతూనే వస్తోంది. కాంగ్రెస్ నేత శశి థరూర్ ఏకంగా దేశ రాజధానిగా ఢిల్లీని ఇంకా కొనసాగించాలా? అని చర్చకు తెరతీయడం తో ఈసారి హైదరాబాద్ రెండో రాజధానిగా కాకుండా ఏకంగా దేశ రాజధానిగా చేస్తే బాగుంటుందని మెజార్టి నెటిజన్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**సుముఖంగా లేని రాజకీయ పార్టీలు :** తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత పదేండ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎ స్ పార్టీ కానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కానీ, హైదరాబాద్ బేసుడ్ ఎంఐఎం పార్టీ హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేయాలన్న ప్రతిపాదన పట్ల సముఖంగా లేవు. ఒకవేళ అదే జరిగితే హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంతం అవుతుందని, అప్పుడు హైదరాబాద్ పూర్తిగా కేంద్రం ఆధీనంలోకి వెళ్తుందని, అప్పుడు ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం ఎదుర్కొంటున్న వంటి ఇబ్బందులే వస్తాయని తెలంగాణలో ప్రధాన రాజకీయ పార్టీలు జంకుతున్నాయి. కాగా ఈ సారి చర్చకు తెరదీసింది కాంగ్రెస్ నాయకుడు శశి థరూర్ కావడంతో రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ నాయకులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

**నాగ్‌పూర్, చెన్నై పేర్లు కూడా...** ఇలా ఉండగా హైదరాబాద్ కాకుండా దేశ రాజధానిగా నాగ్‌పూర్, చెన్నై, బెంగళూర్‌ను చేయాలని కొందరు నెటిజన్లు అభిప్రాయపడ్డారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఆర్‌ఆర్‌ఎస్‌కు హెడ్ క్వార్టర్ అయిన నాగపూర్‌ను రాజధానిని చేయాలని బీజేపీ అనుకూల నెటిజన్లు సూచిస్తున్నారు. మరి కొందరు చెన్నై అయితే బాగుంటుందని, కొందరు బెంగళూర్ బాగుంటుందని సూచిస్తున్నారు.

అయితే చెన్నైకి వరద ముప్పు, బెంగళూరులో ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయని, ఇవేవి లేని హైదరాబాద్ అయితే అన్ని విధాల అనుకూలమని మెజార్టీ నెటిజన్లు మొగ్గు చూపుతున్నారు.

# సంపాదకీయం

## జమిలి ఎన్నికలకు మహారాష్ట్ర చూపిస్తుందా ?

దేశంలో రెండు కీలకమైన రాష్ట్రాల కు బుధవారం పోలింగ్ జరిగింది. జార?ండ్ లో 68 శాతానికి పైగా పోలింగ్ జరిగితే మహారాష్ట్రలో బాగానే సాగింది. ఇక ఫలితాలు ఈ నెల 23న రానున్నాయి. అయితే దాని కంటే ముందు వచ్చిన ఎగ్జిట్ పోల్స్ రిజల్ట్ మాత్రం కేంద్రంలో ఎన్డీయే కూటమికి మద్దతుగా ఉండడం విశేషం. అత్యధిక శాతం ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఈ రెండు రాష్ట్రాలలో ఎన్డీయే కూటమి గెలుస్తుందని కచ్చితంగా చెబుతున్నారు. ఏపీలో 164 సీట్లు టీడీపీ కూటమి గెలుచుకుంటుందని అంచనా వేసిన కేకే సర్వే మహారాష్ట్రలో ఎన్డీయే కూటమికి మొత్తం 225 స్థానాలు లభిస్తాయని అంచనా కట్టింది. దాంతో దీని మీద మరింత ఆసక్తి పెరిగింది. ఇక జార?ం దులో మ్యాజిక్ ఫిగర్ ని ఎన్డీయే కూటమి దాటేస్తుందని ఎక్కువ సర్వేలు చెప్పాయి. ఇక ఈ రెండు రాష్ట్రాల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలే కనుక 23న అసలైన ఫలితాలలో ప్రతిబింబిస్తే మాత్రం జాతీయ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోతాయని అంటున్నారు. కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఇది అతి పెద్ద బూస్టింగ్ గా ఉంటుందని అంటున్నారు. 2027 మొదట్లో జమిలి ఎన్నికలకు సిద్ధం కావాలని చూస్తున్న బీజేపీ పెద్దలకు ఈ ఎన్నికల్లో ఘన విజయాలు దకితే మాత్రం ఇక నల్లేరు మీద నడకలా జమిలి ఎన్నికలు దూసుకుని వచ్చేస్తాయని అంటున్నారు. ఇక మహారాష్ట్రలో కనుక బీజేపీ నాయకత్వంలోని కూటమి గెలిస్తే మోడీ ప్రభుత్వానికి అది ఎంతో మోరల్ సపోర్ట్ ఇస్తుందని అంటున్నారు. అదే విధంగా జార?ండ్ లో బీజేపీ అత్యధిక కాలం రాజ్యం చేసింది. ఈ దఫా మళ్ళీ గెలుస్తుందని ముందు నుంచి కొంత అంచనా ఉంది. మరో వైపు చూస్తే ఈ రెండు అసెంబ్లీ ఎన్నికల తరువాత వచ్చే ఏడాది ఢిల్లీ, బీహార్ కి ఎన్నికలు ఉన్నాయి. అయితే వాటిని సైతం బీజేపీ గెలిస్తే ఇక తిరుగు ఉండదని అంటున్నారు. ఆ మీదట 2026లో జరిగే యూపీ ఎన్నికలను మాత్రం వాయిదా వేసి 2027 మొదట్లో జరిగే జమిలి ఎన్నికలతో కలిపేస్తారు అని అంటున్నారు. ఇక జమిలి ఎన్నికలు కూడా జరిపించేందుకు బీజేపీ మంచి ముహూర్తాలనే వెతుకుతుందని అంటున్నారు. మహారాష్ట్రలో కనుక ఎన్డీయే గెలిస్తే ఇండియా కూటమికి మరింత ఇబ్బంది అవుతుందని రాజకీయంగా ఆ శిబిరంలో నిరాశ కనిపిస్తుందని అదే బీజేపీకి కావాల్సింది అని అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఈ నెల 23న వచ్చే మహా ఫలితాలను చూసిన మీదట జమిలి ఎన్నికల మీద దేశంలోని రాజకీయ పార్టీలు ఫుల్ క్లారిటీకు రావచ్చు అని అంటున్నారు. సో వెయిట్ అండ్ సీ.

# చదువొక్కటే కాదు.. ఎన్నెన్నో



హైదరాబాద్ : "విషయం అర్థంకాకుండా రాత్రింబవళ్లు పుస్తకాలు చదివితే ఆయాసం తప్ప మరేం రాదు. అందుకే ఓ గంటసేపు నృత్యం చేయండి. పాటలు పాడండి. తీరొక్కపూలతో బతుకమ్మ చుట్టూ ఆడండి.. గదిలో మీరొక్కరే ఉన్నారనుకుని మీకిష్టమైన రాగంలో పాట పాడండి" అని జేఎన్‌టీయూ అధికారులు ప్రథమ సంవత్సరం విద్యార్థులతో చెబుతున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐ ఐటీ) తరహాలో విద్యార్థుల అభిరుచులకు అనుణంగా 12 క్లబ్‌లను ఏర్పాటుచేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు క్లబ్‌ల్లో రెండింటిని తప్పనిసరిగా ఎంచుకోవాలి. బాగా నేర్చుకున్నాక సదరు విద్యార్థులకు క్రెడిట్ పాయింట్లు ఇవ్వనున్నారు. సమకాలీన అంశాలపై విద్యార్థుల మనోగతాన్ని తెలుసుకోనున్నారు. ఇంజినీరింగ్ పూర్తయ్యేసరికి కనీసం రెండు క్లబ్‌లలో వారు నేర్చుకున్న అంశాల్లో నిష్ణాతులుగా మారనున్నారని జేఎన్‌టీయూ అధికారులు చెబుతున్నారు.

**మీకు నచ్చిందే నేర్చుకోండి**

ఐఐటీల్లో ఇంజినీరింగ్ తొలి సంవత్సరంలో చేరే విద్యార్థులు దేశం నలుమూలల నుంచి వస్తున్నారు. వీరికి ఆహారం, వసతి అన్నీ భిన్నంగా ఉంటాయి. కొత్తలో తరగతులకు వెళ్లినా ఇబ్బందులే. వీటన్నింటినీ వారు అధిగమించేందుకు క్లబ్‌లను ఏర్పాటుచేశారు. ఇవి సత్ఫలితాలిస్తుండటంతో ఇక్కడ 12 క్లబ్‌లను ఏర్పాటుచేశారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ భ్రమర.. వీటిని పర్యవేక్షిస్తున్నారు. ప్రధానంగా 'ఆర్ట్ మేకరీ,' ఎలైట్ ఫీట్, రాగవర్ష, కోడింగ్ క్లబ్, ఫొటోగ్రఫీ వంటి అంశాల్లో రెండింటిని ఎంపిక చేసుకోవాలి.

**ఇష్టంగా చదవాలన్న లక్ష్యంతో**

– ప్రొఫెసర్ భ్రమర, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం

విద్యార్థులు వారి సబ్జెక్టులు ఇష్టంగా చదవాలన్న లక్ష్యంతో ఈ క్లబ్‌లను ప్రారంభించాం. చదువుతోపాటు చుట్టూ ఉన్న ప్రపంచం వారికి తెలియాలి. ప్రథమ సంవత్సరం పూర్తయ్యేలోపు ఆల్ రౌండర్‌గా ఎదగాలన్నదే మా ధ్యేయం. ప్రతి క్లబ్‌కు ఒక ప్రత్యేకత ఉంది. ఇంటర్ వరకు భయపడుతూ చదివే పిల్లలకు.. ఇంజినీరింగ్‌లో ఒకేసారి అపరిమిత స్వేచ్ఛ లభిస్తుంది వీరి ఆలోచనలను సరైన దిశలో మళ్లించేందుకు క్లబ్‌లను ప్రారంభించాం.ు

**సంగీతం, చిత్రలేఖనం, ఛాయాచిత్రం**

జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ప్రథమ సంవత్సరం విద్యార్థుల్లో చాలామంది సంగీతం, చిత్రలేఖనం, ఛాయాచిత్రాలపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారని అధికారులు తెలిపారు. చరవాణుల్లో ఫొటోలు తీసి వాటికి ప్రత్యేకతలను అదనంగా జత చేర్చినట్లే ఫొటోగ్రఫీ క్లబ్‌లో ఫొటోలను సృజనాత్మకంగా తీస్తున్నారు. ఇందులో సాంకేతిక అంశాలను వివరించేందుకు ఫొటోగ్రాఫర్లతో తరగతులు నిర్వహిస్తున్నారు. మరోవైపు సంగీతం, చిత్రలేఖనం అంశాల్లోనూ శిక్షణ ఇవ్వనున్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థులకు ఈ క్లబ్‌లలోనే 'కృత్రిమ మేధ' 'కోడింగ్' 'డేటాసైన్స్' 'ఐసీఈ' వంటి క్లబ్బులను ఏర్పాటుచేసి శిక్షణ ఇవ్వనున్నారు. సంగీతం, చిత్రలేఖనం, నృత్యం వంటి అంశాల్లో పోటీ పరీక్షలు నిర్వహించి ప్రోత్సాహకంగా చిన్నచిన్న బహుమతులను అందజేస్తున్నారు. ఆసక్తి ఉన్న రెండు అంశాల్లో నిష్ణాతులయ్యేలా రూపకల్పన

# పెళ్లి బాజా.. ఖర్చుల మోత



హైదరాబాద్: గ్రేటర్‌లో పెళ్లి సందడి మొదలైంది. మూడు నెలల పాటు మంచి ముహూర్తాలే ఉండటంతో పెళ్లి వేదికల బుకింగ్‌లు, కేటరింగ్, దుస్తులు, బంగారం కొనుగోళ్లతో వ్యాపారాలు కళకళలాడుతున్నాయి. వివాహమనేది జీవితంలో మరుపురాని ఘట్టం కావడంతో కలకాలం గుర్తిండిపోయేలా.. అందరూ గుర్తుంచుకొనేలా చేయాలనుకుంటున్నారు. దేశవ్యాప్తంగా 48 లక్షల పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా. వీటి కోసం రూ.6 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్టు కాన్ఫడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ సర్వేలో వెల్లడించింది. ఇందులోని వివరాల ప్రకారం గ్రేటర్‌లో ఈ సీజన్‌లో 5 వేల పెళ్లిళ్లు జరుగుతుండగా...రూ.625 కోట్లకు పైగా వ్యాపారం జరగనుంది.

పెళ్లిళ్ల ఖర్చులు సగం సగమంటూ ముందుగానే ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇలా 59శాతం పెళ్లిళ్లలో జరుగుతోందని 'వెడ్ మి గుడ్' అనే సంస్థ తన అధ్యయనంలో వెల్లడించింది. 32శాతం మంది సొంతంగానే ఖర్చులు భరిస్తుస్తున్నట్టు వెల్లడించింది.

నిశ్చితార్థం నుంచి మొదలుకొని పెళ్లితంతు ముగిసే వరకు డెకరేషన్ చేసేవాళ్లు, డీజే సంగీతం, బ్యాండ్, ఫొటో, వీడియోగ్రాఫర్లు, శామియానా, పురోహితులు, కేటరింగ్, పత్రికలు, దుస్తులు, బంగారం కొనుగోళ్లు, మేకప్, మెహందీ ఆర్టిస్టులు ఇలా అనేక మందికి ఉపాధి దొరుకుతోంది.

**అన్నీ పెరిగాయ్..**

గతంతో పోల్చితే అనేక విభాగాల్లో ఖర్చులు పెరిగాయి. పెళ్లి వేదికల ఖర్చు గతంలో రూ.50వేల నుంచి రూ.7–8లక్షల వరకు ఉండగా ప్రస్తుతం రూ.75వేల నుంచి రూ.10లక్షలకు పెరిగింది. ప్లేటు భోజనానికి గతంలో రూ450 – రూ.1000 ఉంటే అది రూ.700 – రూ.1500 వరకు పెరిగింది. కూరగాయలు, నిత్యవసరాల ధరలు పెరగడంతో ప్లేటు భోజనానికి అయ్యే ఖర్చు పెరిగిందని కేటరింగ్ సేవల ప్రతినిధులు తెలిపారు.

భోజనం 'ఆహా' అనిపించేలా...భోజనాల్లో కనీసం 15 నుంచి 20 రకాలు అందుబాటులో ఉండాలని ఎక్కువ మంది భావిస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కేటరింగ్ సర్వీసుల వాళ్లు ఇరువర్గాలకు సంబంధించి ఐదు నుంచి పది మందిని పిలిచి వేర్వేరు వంటకాలను అప్పటికప్పుడు వండి రుచి చూపిస్తున్నారు. శాకాహారంలో.. ఉత్తర, దక్షిణ భారతదేశ వంటకాలను ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు. వెజ్ స్టార్టర్‌లలో పనీర్, మంచూరియా ఉండాలని కోరుతున్నారు, వెజ్ బిర్యానీ, బొబ్బట్లు, పనీర్ కూర, మూడు పచ్చళ్లు, ఇతర కూరగాయలు, ఉలవచారు, సాంబార్, రైతా, రెండు నుంచి మూడు పొడులు, ఐస్‌క్రీమ్, ఖద్దూ కా కీర్, గులాబ్ జామూన్, ఖుబానీ కా మీఠా, వీటితో పాటు పానీపూరీ, ఇడ్లీ, దోశ వంటి అల్పాహారం ఉండాలని కోరుతున్నారు. మాంసాహారంలో మటన్, చికెన్, చేపలు, రొయ్యలతో చేసిన 3 నుంచి 4 వెరైటీలు ఉండేలా చూసుకుంటున్నారు.

# అయ్యో.. భీమారం..!



కేతేపల్లి : ఆ రహదారి సమస్య ఎన్నో ఏళ్ల నాటిది. మూడు నియోజకవర్గాలను కలుపుతూ విస్తరించి ఉన్నా.. విస్తరణకు నోచుకోవట్లేదు. ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతో దశాబ్దాలుగా కొత్త రహదారి నిర్మాణానికి నోచుకోవట్లేదు. సరైన మరమ్మతులకు కూడా అడుగు ముందుకు పడటంలేదు. ఇది సూర్యాపేట నుంచి భీమారం మీదుగా మిర్యాలగూడకు వెళ్లే రహదారి దుస్థితి.

ఉమ్మడి జిల్లాలో ప్రధానమైన సూర్యాపేట– మిర్యాలగూడ పట్టణాల మధ్య కేతేపల్లి మండలం భీమారం మీదుగా ఉన్న రహదారి అభివృద్ధి పనులు ఏళ్లతరబడి పూర్తి కావడంలేదు. దీంతో ప్రతినిత్యం ఆ రహదారిపై ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి సూర్యాపేట, నకిరేకల్, మిర్యాలగూడ శాసనసభా నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. అయినా.. ఈ పనిని పూర్తిచేసే విషయంలో సంబంధిత ఎమ్మెల్యేలు పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి.

పదేళ్ల క్రితం ప్రారంభమైన రెండు వరుసల రహదారి పనులు మూడు, నాలుగు సార్లు నిలిచిపోయాయి. చేసిన పనులకు బిల్లులు రావడం లేదని.. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా ధరలు పెంచాలనే సాకుతో గుత్తేదారు పనులను నిలిపివేశారు. పనులు మొత్తం పూర్తయితేనే బిల్లులు చెల్లిస్తామని అధికారులు సంబంధిత గుత్తేదారుడితో తేల్చి చెప్పారు. కొత్త రహదారి పనులు పూర్తికాక.. పాత రహదారికి మరమ్మతులు చేయకపోవడంతో రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. చాలా చోట్లా కేవలం కంకర పోసి బీటీ వేయకుండా వదిలేశారు.భీమారం నుంచి శెట్టిపాలెం వరకు వంతెన పనులు నిలిపేశారు. వంతెనల వద్ద రహదారి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఇటీవల వంతెన కుంగిపోవడంతో సూర్యాపేట– మిర్యాలగూడ పట్టణాల మధ్య రెండుమూడు రోజుల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమస్య తీవ్రంగా ఉన్నా.. ఈ రహదారిపైన దృష్టి సారించడంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ అధికార పార్టీకి చెందిన వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ప్రస్తుతం సూర్యాపేట మినహా మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలు అధికార పార్టీకి చెందిన వారే ఉన్నా.. రహదారి పనులు పూర్తి చేయించడంలో ఆశించిన స్థాయిలో చొరవ చూపడం లేదనే ఆరోపణలున్నాయి.

**చర్యలు తీసుకుంటాం**

రహదారిలో ప్యాచ్‌వర్కులు, వంతెనల నిర్మాణం, అసంపూర్తి పనులు పూర్తిచేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. వివిధ కారణాలతో పనులు నిలిచిపోయాయి. అన్నింటినీ సమీక్షించి రహదారి పనులు పూర్తి చేయిస్తాం.సత్యనారాయణరెడ్డి, ఈఈ, ఆర్అండ్‌బీ

# రుడా దిశగా అడుగులు

గోదావరిఖని : రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) ఏర్పాటుకు వేగంగా చర్యలు చేపడుతున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం కసరత్తు పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదించింది. పెద్దపల్లి, మంథని పురపాలక సంఘాలతోపాటు.. రామగుండం నగరపాలక సంస్థను అలాగే కమాన్‌పూర్, రామగిరి, అంతర్గాం, పాలకుర్తి, ఎండపల్లి, ధర్మారం మండలాలను కలుపుకుని 'రుడా' ఏర్పాటు చేసేందుకు యంత్రాంగం కసరత్తు పూర్తిచేసింది. దీని పరిధిలో సుమారు 6 నుంచి 7 లక్షల జనాభా ఉండే విధంగా ప్రణాళికలు చేస్తున్నారు. భారీ పరిశ్రమలకు నిలయమైన పెద్దపల్లి జిల్లాలో 'రుడా' ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం దాదాపుగా అన్ని రకాలుగా కసరత్తు చేసింది.

పంచాయతీలు యథావిధిగా..రుడా ఏర్పాటుతో పంచాయతీల స్వయం



ప్రతిపత్తికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు. పంచాయతీల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం యథావిధిగా అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు రుడా ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. రామగుండం.. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద ఉండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ప్రత్యేక నిధులు విడుదలవుతాయి. స్థానికంగా వసూలుచేసే వివిధ రకాల పన్నులను కూడా ఇక్కడే అభివృద్ధి కోసం వెచ్చించుకునే అవకాశం ఉంటుంది. మౌలిక సదుపాయాలు, తాగునీటి సమస్యలపై అదనంగా నిధులు కేటాయించనున్నారు.బి–కేటగిరీ నగరంగా గుర్తింపు..

రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీతో బి–కేటగిరి నగరంగా గుర్తించనున్నారు. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు కూడా ఇది వర్తిస్తుంది. గ్రామాలు కూడా పట్టణీకరణకు నోచుకోనున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనాల్లో పెరుగుదల ఉంటుంది. తాత్కాలిక కార్మికులకు సంబంధించి సౌకర్యాలు పెరిగే అవకాశమూ ఉండనుంది. రుడా పరిధిలో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరాం సిమెంటు ఫ్యాక్టరీ, జెన్‌కో విద్యుత్తు కేంద్రాలు ఉండటంతో మరిన్ని నిధులు అభివృద్ధి కోసం వెచ్చించుకోవచ్చు.

**వచ్చే క్యాబినెట్‌లో ఆమోదం**

వచ్చే మంత్రివర్గ సమావేశంలో 'రుడా' ఏర్పాటుకు ఆమోదం తెలపనున్నారు. దీనివల్ల ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు వచ్చే అవకాశముంది. పట్టణీకరణ పెరుగుతుంది. రుడా వల్ల ఎవరికి ఇబ్బంది ఉండదు. కొంతమందిలో అపోహలున్నాయి. రుడాతో ఏ గ్రామానికి నష్టం జరగదు. అభివృద్ధి చేసుకోవడానికి నిధుల కొరత ఉండదు. రుడా పరిధిలో ఉన్న పట్టణాలు, గ్రామాలకు దీని నిధులు కేటాయించుకోవచ్చు.మక్కాన్‌సింగ్, ఎమ్మెల్యే

# అదను చూసి బకాయిల వసూళ్లు

సిరిసిల్ల : సహకార విద్యుత్తు సరఫరా సంఘం అధికారులు బకాయిల వసూళ్లను ముమ్మరం చేశారు. భారీగా ఉన్న వాటిని రాబట్టేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే సిబ్బంది రంగంలోకి దిగారు. గత కొన్ని నెలలుగా చెల్లించని వినియోగదారులు విడతల వారీగా చెల్లించేందుకు అవకాశం కల్పించారు. అయినా ముందుకు రాని వారి విద్యుత్తు కనెక్షన్‌ను తొలగిస్తున్నారు. ఇలా మొత్తం బకాయిలు వసూలు చేసి నష్టాలు నుంచి సెస్‌ను గట్టెక్కించేందుకు చర్యలు చేపడుతున్నారు.

సెస్‌కు చెల్లించాల్సిన బకాయిలు మొత్తం రూ.139.75 కోట్లు ఉన్నాయి.వివిధ కేటగిరీలకు చెందిన వినియోగదారులు బకాయిలను చెల్లించాల్సి ఉంది. వీరిలో కేటగిరీ–1 కింద అంటే గృహ వినియోగదారులే ఎక్కువగా ఉన్నారు. అన్ని రకాల కనెక్షన్‌లు 2,65,443 ఉండగా, ఇందులో గృహ వినియోగదారులకు సంబంధించినవి 1,64,929 ఉన్నాయి.

బకాయిలు వసూలు చేయాలనే లక్ష్యంతో అధిక మొత్తంలో ఉన్న



వినియోగదారులు దశల వారీగా చెల్లించేందుకు సెస్ అధికారులు అవకాశం కల్పించారు. ప్రభుత్వం 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్తు వినియోగదారులకు ఉచిత విద్యుత్తును ప్రకటించింది. గృహజ్యోతికి అర్హులుగా ఎంపికైన వారిలో చాలా మంది ఎంపికకాక ముందు చాలా నెలలుగా బిల్లులు చెల్లించలేదు. దీంతో బకాయిలు పేరుకుపోయాయి. గృహజ్యోతికి ఎంపికైన వారు ప్రతి నెలా ఉచితంగా విద్యుత్తును పొందుతున్నారు. అయినా పాత బకాయిలు చెల్లించడం లేదు. ఎక్కువ మొత్తంలో బకాయి ఉన్న వారు ఒకేసారి చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి వారు మూడు, నాలుగు విడతల్లో చెల్లించడానికి వీలు కల్పించారు.

కట్టడానికి ముందుకు రాకపోతే విద్యుత్తు కనెక్షన్ తొలగిస్తున్నారు. దీంతో బకాయిలు చెల్లించే వరకు చీకట్లో ఉంటున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

సెస్‌కు వివిధ కేటగిరీల వినియోగదారుల నుంచి మొత్తం రూ.139.75 కోట్ల బకాయిలు ఉన్నాయి. వీరిలో చాలా మంది ఎక్కువ మొత్తంలో కట్టాలి. ఒకేసారి చెల్లించడానికి ఇబ్బందులు పడతారు. దీనికోసం వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా మూడు, నాలుగు విడతల్లో చెల్లించడానికి అవకాశం కల్పించాం. ఈ అవకాశాన్ని బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలి. బకాయిలు కట్టని వారి విద్యుత్తు కనెక్షన్‌ను తొలగిస్తాం.శ్రీనివాసరెడ్డి, సెస్ ఎండీ

## ఊరించి.. ఉసూరుమనిపించి

వేములవాడ : జలాశయంలో సర్వం కోల్పోయిన మధ్యమానేరు నిర్వాసితులు సుమారు దశాబ్దకాలంగా రూ.5.04 లక్షల కోసం అనేక రూపాల్లో తమ నిరసనలు వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వస్తే ఇస్తామని ప్రకటించారు. అయితే ఈనెల 20న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఇళ్లు నిర్మించుకోని వారికి మాత్రమే ప్రభుత్వం 4,696 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. ఇప్పటికే గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న 5,987 కుటుంబాలకు రూ.5.04 లక్షల చొప్పున చెల్లింపుపై స్పష్టత లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేసే విధంగా ప్రకటన చేయాలని కోరుతున్నారు. జిల్లాలోని బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయంలో కొదురుపాక, వరదవెల్లి, నీలోజిపల్లి, కొదుముంజ, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, చీర్లవంచ, శాభాష్‌పల్లి, చింతల్‌ఠాణా, గుర్రంవాణిపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాల్లో 10,683 కుటుంబాలను గుర్తించి నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను ఏర్పాటు చేశారు. జలాశయంలో 2017లో పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేయడంతో ముంపు గ్రామాలను వదిలి తమకు కేటాయించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. మరికొంత మంది ఇళ్లు నిర్మించుకోలేదు.

**రూ.5.04 లక్షల కోసం...**

2016లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్యమానేరు నిర్వాసితులకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం కోసం రూ.5.04 లక్షలు ఇస్తామని ప్రకటించారు. అనంతరం వివిధ కారణాలతో చెల్లింపులు సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తాము రూ.5.04లక్షలు



ఇస్తామని ప్రకటించడంతో అసెంబ్లీ ఎన్నికల్లో నిర్వాసితులు కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా నిలిచారు.

**ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో...**

వేములవాడలో ఈనెల 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఇళ్లు నిర్మించుకోని వారికి 4,696 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ జీవో జారీ చేశారు. ఇప్పటికే 5,987 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకున్నాయి. వీరికి సంబంధించి రూ.5.04 లక్షలపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో వీరిలో ఆందోళన మొదలైంది. ఇళ్ల నిర్మాణాల కోసం బ్యాంకు రుణాలు తీసుకున్నామని, అప్పులు చేశామని ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వం హామీ ఇచ్చి విస్మరించగా తమ పక్షాన పోరాడిన నాయకులు ప్రస్తుతం ప్రభుత్వంలో ఉండటంతో తమకు న్యాయం జరుగుతుందని భావించామని చెబుతున్నారు. కానీ నిరాశ తప్పలేదని పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో తమకు న్యాయం జరిగే విధంగా ప్రకటన చేయాలని కోరుతున్నారు.

**4,696 మందిలో ఇళ్లు నిర్మించే వారెందరు?**

ప్రభుత్వం ప్రస్తుతం మంజూరు చేసిన 4,696 ఇందిరమ్మ ఇళ్లలో మెజారిటీ కుటుంబాలు నిర్మాణం చేపట్టకున్న చర్చ సాగుతోంది. కొంత మంది ఇప్పటికే స్థలాలు విక్రయించగా, మరికొంత మంది ఆర్థిక పరిస్థితుల వల్ల ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. దీంతో జీవనోపాధికి ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారిలో కొంత మంది మాత్రమే నిర్మించుకునే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ప్రతి నిర్వాసితుడికి ఇవ్వాలి - కాచం నిఖిల్, నిర్వాసితుడు, సంకెపల్లి**

ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిర్వాసితుడికి రూ.5.04 లక్షలు చెల్లించాలి. లేకుంటే గత ప్రభుత్వం మాదిరిగానే మోసం చేసినట్లుగా భావించాల్సి వస్తుంది. స్థానికంగా ఇళ్లు నిర్మించుకొని ఉంటున్న నిర్వాసితులకు ఏం సమాధానం చెబుతారో స్పష్టత ఇవ్వాలి. కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న నేను రూ.5.04 లక్షలు ఇస్తామనడంతో రూ.10 లక్షల బ్యాంకు రుణం తీసుకొని ఇంటి నిర్మాణం చేపట్టా. నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం సంతోషం. కాని ఇళ్లు నిర్మించుకున్న వారిపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో వారిలో ఆందోళన మొదలైంది.

**మంజూరు పత్రాలు ఇస్తే...- సట్ట వెంకటేశం, కొదురుపాక**

ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటి వరకు ఇంటి నిర్మాణం చేపట్టలేదు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. అధికారులు మంజూరు పత్రాలు, అనుమతులు ఇస్తే త్వరలోనే ఇంటి నిర్మాణం ప్రారంభిస్తాను. ఇళ్లు లేని నాలాంటి వాళ్లకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది.

## మొక్కజొన్నపై మక్కువ

చింతకాని : అన్నదాతలు మక్కలపై మక్కువ పెంచుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా రబీలో ఏటేటా మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతోంది. వాణిజ్య పంటల సాగుకు ప్రతికూల అంశాలు కలవరపెడుతుంటే మక్కల విషయంలో సానుకూల పరిణామాలు రైతుల ఆసక్తికి కారణమవుతున్నాయి. ప్రకృతి ప్రతికూలతలతో గత మూడేళ్ల నుంచి జిల్లాలో పత్తి, ఇతర వాణిజ్య పంటలు సరైన దిగుబడి రాలేదు. మద్దతు ధర సైతం దక్కక పలువురు రైతుల, కౌలుదారులు మధ్యలోనే పత్తి పంటను తొలగిస్తున్నారు. ఆయా క్షేత్రాల్లో మొక్కజొన్నను విత్తుతున్నారు.

**లాభసాటిగా భావిస్తూ..**

2019లో క్వింటా మొక్కజొన్న ధర రూ.1,550 నుంచి రూ.1,750 వరకు ఉండగా ప్రస్తుతం రూ.2300- 2800కు చేరింది. విత్తు, పై పాట్లు, కంకిపట్టటం, ఆరబోయట వంటి పనులన్నీ యంత్రాల ద్వారానే చేపడుతుండటంతో కూలీలపై ఆధారపడే అవసరం ఉండటం లేదు. పది ఎకరాల సాగుకూ కేవలం కుటుంబంలో ఇద్దరి శ్రమ సరిపోతోంది. అనుకూల పరిస్థితుల్లో ఎకరానికి 40 క్వింటాళ్ల సరాసరి దిగుబడి వస్తుంది. ఖర్చులన్నీ పోను రూ.40 వేల వరకూ మిగులుతుండటంతో రైతులు లాభసాటిగా భావిస్తున్నారు.

ఎందుకిలా?

పెట్టుబడి తక్కువగా ఉండటం

అదుపులో తెగుళ్ల బెడద

కూలీల అవసరం తక్కువ

కేవలం రైతు దంపతుల శ్రమతోనే పూర్తి సాగు

తక్కువ నీటి వినియోగం

వాతావరణ ప్రతికూల పరిస్థితులు తట్టుకుని నిలబడటం

గిట్టుబాటు ధర

ప్రైవేటు వ్యాపారులు మద్దత ధర మించి కొనుగోలు చేయటం

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు.

'సొంత పొలంతోపాటు కౌలుకు తీసుకొని మొత్తం నలభై ఎకరాల్లో మొక్కజొన్న సాగుకు ఏర్పాట్లు చేస్తున్నా. ఇప్పటికే 15 ఎకరాల్లో విత్తనాలు వేశా. వాణిజ్య పంటల సాగు లాభదాయకంగా లేకపోవటంతో నాలుగేళ్ల నుంచి దీనిపై దృష్టి సారించా. ప్రస్తుతం మొక్కజొన్నకు మార్కెట్ ధర బాగుంది.'

దొబ్బల నరసింహారావు, రైతు, రాఘవాపురం, చింతకాని

'రైతులు గుర్తింపు పొందిన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. దేశంలో కోళ్ల, పశువుల దాణా, స్టార్చ్ ఉత్పత్తులకు మొక్కజొన్నను వినియోగిస్తుండటంతో గిరాకీ పెరిగింది. రబీలో అనుకూల పరిస్థితుల కారణంగా అధిక దిగుబడి వస్తుంది. ప్రకృతి ప్రతికూలతలనూ ఇది తట్టుకుని నిలబడగలదు.'డాక్టర్ కె.రవికుమార్, వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్

# అసలే డొక్కు.. ఆపై షెడ్డుకు!



పరిగి: దోమ మండలం బాసుపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు గతనెల 27న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉస్మానియాకు రిఫర్ చేశారు. అందుబాటులో ప్రభుత్వ వాహనం లేకపోవడంతో ప్రైవేట్ వాహనంలో తరలించాల్సి వచ్చింది. పరిగి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు గత నెల 27న తమ స్వగ్రామం నుంచి బైక్‌పై పరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి కింద పడి బలమైన గాయాలయ్యాయి. ఉస్మానియాకు రిఫర్ చేశారు. అప్పటికే అంబులెన్స్ మరో ప్రాంతానికి వెళ్లడంతో ప్రైవేట వాహనమే దిక్కయింది.

వైద్యరంగానికి ఇతోధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా గ్రామీణ ఆసుపత్రుల్లో మాత్రం ఇంకా వసతులు మెరుగు పడటం లేదు. ప్రజల ప్రాణాలను నిలబెట్టే అంబులెన్సు వాహనాలు కూడా లేకపోవడంతో సకాలంలో సేవలందక రోగులు నానా అవస్థలు పడుతున్నారు. కొందరు మృత్యువాత పాలవుతున్నారు. ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది పరిగి నియోజకవర్గ ఆసుపత్రి.

**రూ.3,000 నుంచి రూ.4,000 ఖర్చు పెట్టాల్సిందే..:** నియోజకవర్గానికి ఏకైక దిక్కువగా ఉన్న పరిగి సామాజిక ఆసుపత్రికి నిత్యం వందలాది మంది రోగులు వస్తున్నారు. మెరుగైన సేవలకు నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి రిఫర్ చేస్తుంటారు. కానీ వారిని తరలించేందుకు ఉన్న ఒకే ఒక్క అంబులెన్సు వాహనం మరమ్మతుకు గురై షెడ్డుకు చేరింది. దీంతో పేదలు ప్రైవేట్ వాహనాల్లో పరిగి నుంచి హైదరాబాద్‌కు తరలించాలంటే రూ.3,000 నుంచి రూ.4,000 దాకా వెచ్చించాల్సి వస్తోంది.

**నెల రోజులైనా స్పందన కరవు:** బీజాపూర్ –హైదరాబాద్ జాతీయ రహదారి పరిగి నియోజకవర్గం మీదుగా వెళ్లింది. రద్దీగా ఉండే ఈరోడ్డుపై ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. వీటితో పాటు పరిగి సర్కిల్ పరిధిలోనూ రోజూ జరుగుతున్నాయి. ఆరు నెలల కాలంలో (అక్టోబరు నుంచి) 39 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 17 మంది మృత్యువాత పడ్డారు. మరో 20మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారు. ఇందుకు కారణం సరైన అంబులెన్స్ లేక చికిత్సలు దూరం కావడం.

**కొత్త వాహనాన్ని అడిగాం**

పాత వాహనం తరచూ పాడవుతోంది. దానికి బదులుగా కొత్త వాహనాన్ని సమకూర్చాలని ఎమ్మెల్యేను కోరాం. ప్రజాశ్రేయస్సులో భాగంగా ఆయన కూడా కేటాయించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. మరోసారి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.రాజశేఖర్, ఆసుపత్రి సూపరింటెండెంట్.

# బృహత్తర ప్రణాళిక



కరీంనగర్ : గతంలో తయారు చేసిన బృహత్తర ప్రణాళికలో లోపాలు ఉండటంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. నివాసిత ప్రాంతాల్లో ఉన్న జోన్లలో వాణిజ్య ప్రాంతం ఉంటే చిక్కులు వస్తున్నాయి. వ్యవసాయ భూములను నివాసిత ప్రాంతాలుగా భూమార్పిడి చేసుకోవాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి పొందాల్సి వస్తోంది. కొన్ని రహదారుల కొలతల్లో తేడాలుండటం, రోడ్లు లేని చోట రోడ్లుగా చూపించడం సమస్యలకు తావిచ్చింది. ప్రస్తుతం అలాంటి అవస్థలు లేకుండా నగర పరిధిలో ప్రణాళికలు చేస్తున్నారు.

నగరపాలిక పరిధిలో జనాభాకు తగ్గట్లుగా కాలనీల ఏర్పాటు, ఇళ్ల నిర్మాణం జరిగింది కానీ.. రహదారి విస్తరణ, సామాజిక అవసరాలకు ప్రణాళికలు లేకపోవడం లోపం. 1991లో తయారు చేసిన ప్రణాళికను 1997లో సవరించి, ఆమోదించారు. ఆ ప్రణాళికే ఇప్పటికీ అమల్లో ఉంది. 20 ఏళ్లకు ఒకసారి మాస్టర్‌ప్లాన్ తయారు చేయాల్సి ఉండగా కొలిక్కి రావడం లేదు. విలీన గ్రామాల సరిహద్దులు మారాయి. ఈ నేపథ్యంలో వచ్చే నెలాఖరులోగా సుడా, నగరానికి కొత్త ప్రణాళిక అమలు చేయడానికి కసరత్తు చేస్తున్నారు.

**అవసరాల మేరకు..**

కొత్త బృహత్తర ప్రణాళికను ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తయారు చేస్తున్నారు. గతంలో అయిదు రకాల భూములుగా విభజించడంతో అనుమతులకు సమస్యలు వస్తున్నాయి. వాణిజ్య, నివాసిత, పారిశ్రామిక, చెరువులు, కుంటలు ఉన్న చోట అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. కొందరైతే అనుమతులు రాకపోవడంతో అక్రమ నిర్మాణాల వైపు మొగ్గు చూపించారు.

గతంలో వ్యవసాయ భూములను నివాసిత ప్రాంతాలుగా చూపించకుండా వదిలేశారు. ప్రస్తుతం విలీన గ్రామాల్లోని వ్యవసాయ భూములను సులువుగా నివాసిత ప్రాంతాలుగా మార్చుకునే వీలు కల్పించారు. 40 ఫీట్ల పైబడిన వాటన్నింటిని మిక్స్‌డ్ ల్యాండ్ కింద చూపించారు. అలకాపురి, బ్యాంకుకాలనీల్లో వంద ఫీట్ల రహదారిగా చూపించనున్నారు. ప్రస్తుతం 30 నుంచి 60 ఫీట్లకు మార్చనున్నారు.

ప్రధాన రహదారులకు ఇరువైపులా, టవర్ సర్కిల్ ప్రాంతాన్ని కమర్షియల్ జోన్‌గా గుర్తించనున్నారు.

అపోలో ఆసుపత్రి నుంచి కిసాన్‌నగర్ వరకు పారిశ్రామిక ప్రాంతంగా గుర్తించడంతో ఇబ్బందులు వచ్చాయి. దీనిని నివాసిత ప్రాంతంగా గుర్తించనున్నారు. పద్మనగర్, ఆటోనగర్ మాత్రమే పారిశ్రామిక జోన్లుగా కొనసాగిస్తారు. చెరువులు, కుంటలు ప్రస్తుతం లేకపోగా, అక్కడ నివాసిత ప్రాంతాలుగా ఉన్నప్పటికి అనుమతులు ఇచ్చే వారు కాదు. అలాంటి చోట సులువుగా అనుమతులు ఇచ్చేలా మార్పులు చేయనున్నారు.లక్ష్మీనగర్, జ్యోతినగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో చెరువులే లేవు. ఇళ్ల సంఖ్య పెరిగిపోగా ఇలాంటివి గుర్తించి ట్యాంకుల పరిధి నుంచి మార్చనున్నారు.

అధికారులు, ప్రభుత్వం చుట్టూ నగరవాసులు తిరగకుండా సులువైన మాస్టర్‌ప్లాన్ తయారు చేశామని మేయర్ వై.సునీల్‌రావు తెలిపారు. ఈ మేరకు ఏడో సమావేశం అనంతరం ప్రభుత్వ అనుమతికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు చెప్పారు.

# నిర్మాణాల్లో ఆదర్శం.. నిర్వహణే కీలకం

కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని నగరాల్లో, పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో జనాభా పెరిగింది. అంతేకాకుండా కుటుంబాల సంఖ్య పెరగడంతో పారిశుద్ధ్య పనుల నిర్వహణ అధ్వానంగా మారింది. ఒకప్పుడు బహిరంగ ప్రదేశాల్లో బహిర్భూమికి వెళ్లడం.. పరిసరాలు అపరి శుభ్రంగా ఉండటం.. వ్యాధుల బారిన పడుతుండటంతో కేంద్ర ప్రభుత్వం 2014 అక్టోబరు 2న మహాత్మాగాంధీ 145 జయంతి సందర్భంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో నిర్మాణాలు పూర్తయ్యాయి. అప్పటినుంచి వ్యక్తిగత మరుగుదొడ్లతోపాటు సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించడంతో అత్యవసర సమయాల్లో ఇబ్బందులు దూరమయ్యాయి. 'నేడు ప్రపంచ టాయిలెట్ దినోత్సవం' సందర్భంగా కథనం.

**నిధుల కేటాయింపు..**

అవసరమైన వారికి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మించేందుకు నిధులు కేటాయించారు. సెప్టిక్ ట్యాంకులు లేని ఇళ్లను పరిశీలించి వాటిని కూడా నిర్మించారు.కరీంనగర్‌లోని మూడు డివిజన్లలో నేరుగా భూగర్భ డ్రైనేజీకి అనుసంధానం చేశారు.

ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలతో స్వచ్ఛభారత్ కింద సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించుకోవడానికి నిధులు మంజూరవుతున్నాయి. ఆకర్షణీయంగా..ప్రజలను ఆకర్షించేలా కరీంనగర్, రామగుండంతో పాటు ఇతర పట్టణాల్లో ప్రజా టాయిలెట్లను అందమైన రంగులతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు.

మహిళల కోసం ప్రత్యేకంగా షీ టాయిలెట్ బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చారు.

వీటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు.

అప్పుడు ర్యాంకులు.. ఇప్పుడు అధ్వానం

కరీంనగర్ నగరపాలిక 2021లో దేశంలోనే మూడు లక్షల జనాభా కలిగిన నగరాలతో పోటీపడి 'సఫాయిమిత్ర సురక్ష ఛాలెంజ్' అవార్డు సాధించి.. రూ.4 కోట్ల నగదు పురస్కారాన్ని దక్కించుకుంది.'

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ఓడీఎఫ్, ఓడీఎఫ్ం సర్టిఫికెట్లు




సాధించి ముందు వరుసలో ఉన్నాయి. నగరంలో అయితే పలుమార్లు ఉత్తమ సులభ్ కాంప్లెక్స్‌లు గుర్తింపు పొందాయి.

ప్రస్తుతం సులభ్ కాంప్లెక్స్‌ల నిర్వహణ కొన్నిచోట్ల అధ్వానంగా తయారైంది.

పట్టణ ప్రగతిలో నిర్మించిన వాటిలో కొన్ని నిరుపయోగంగా మారాయి. ఆయా ప్రాంతాల్లో జనావాసాలు లేకపోవడంతో ఒక్కొక్కటిగా మూలనపడ్డాయి.

కరీంనగర్‌లో అయిదు చోట్ల వినియోగంలో లేకపోవడంతో నిర్వహణ భారంగా మారింది.

**స్వచ్ఛతలో సుల్తానాపూర్ భేష్**

ఎలిగేడు మండలం సుల్తానాపూర్ స్వచ్ఛతలో ఆదర్శంగా నిలుస్తోంది. 1,200 కుటుంబాలు ఉన్న ఇక్కడ ప్రజా చైతన్యం వెల్లివెరిసింది. అప్పటి సర్పంచి వెంకటేశ్వర్‌రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఇంటింటికి మరుగుదొడ్డి నిర్మాణంతో బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామంగా ఎన్నికైంది. మరోవైపు ఇళ్లలోని వృథా నీటికి అడ్డుకట్ట వేసేందుకు ఇంటికో ఇంకుడు గుంత, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో సామూహిక ఇంకుడు గుంత నిర్మించారు. ట్రాక్టర్‌లో రోజువారీగా తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్టు ఎరువు తయారీ చేస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో 2022-23లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో స్వచ్ఛత అవార్డు సొంతం చేసుకుంది.

## నిర్వహణ.. శౌచనీయం

పాల్వంచ : పట్టణాలు, నగరాల్లో అత్యవసర సమయాల్లో ప్రజలు మూత్ర, మల విసర్జన చేసేందుకు వీలుగా ప్రజా మరుగుదొడ్లు (శౌచాలయాలు) నిర్మించారు. స్వచ్ఛ భారత్/సర్వేక్షణ్, పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా గత పదేళ్లుగా వీటి నిర్మాణం, నిర్వహణకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమిస్తున్నాయి. కానీ, ఉమ్మడి జిల్లాలోని పుర, నగరపాలకాల్లో శౌచాలయాల నిర్వహణ తీరు రాన్రాను తీసికట్టుగా మారుతోందన్న విమర్శలున్నాయి. పలుచోట్ల అవి నిరుపయోగంగా మారాయి. వినియోగంలో ఉన్నచోట శుభ్రత, వసతుల తనిఖీ బాధ్యతల్ని అధికార యంత్రాంగం అటకెక్కిస్తోంది. పర్యవేక్షణను ఇలాగే నిర్లక్ష్యం చేస్తే పట్టణాలు సాధించిన ఓడీఎఫ్ లక్ష్యం నీరుగారేలా ఉంది. గతంలో మాదిరిగా కమిషనర్లు, అధికారులు శౌచాలయాల నిర్వహణపై దృష్టిసారించాలని.. నేడు 'ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం' సందర్భంగా పురవాసులు కోరుతున్నారు.

**76 మరుగుదొడ్లు.. 463 సీటింగ్ సామర్థ్యం**

స్వచ్ఛభారత్/సర్వేక్షణ్‌లో భాగంగా ఖమ్మం నగరంతో పాటు మున్సిపాలిటీల్లో నాలుగేళ్ల క్రితం నాటికి 76 ప్రజా మరుగుదొడ్లను 463 సీటింగ్ సామర్థ్యంతో నిర్మించారు. ఒంటికీ, రెంటికీ ప్రజలు పడే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని జన సమ్మర్థ ప్రాంతాల్లో నిర్మించడమే కాకుండా.. పురుషులు, మహిళలు, దివ్యాంగులకు వేర్వేరు వసతులు కల్పించారు. వీటి నిర్వహణ బాధ్యతలను స్థానిక పొదుపు సంఘాల సభ్యులకు అప్పగించారు. ఒక్కో సీటింగ్‌కు నెలకు రూ.2,500 చొప్పున పురపాలకాలు నిర్వాహకులకు వేతనాల్ని చెల్లిస్తున్నాయి. కానీ పలుచోట్ల నిర్వహణ సరిగా లేక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిర్లక్ష్యం తీరు.. స్వచ్ఛ సంకల్పానికి తూట్లు పొడిచినట్లవుతోంది. నిర్మించిన తొలినాళ్లలో మాదిరిగా అన్నిచోట్ల శౌచాలయాలను ఉపయోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. ఇలా చేస్తేనే ఓడీఎఫ్, ఓడీఎఫ్ం, ఓడీఎఫ్ గుర్తింపును కేంద్ర ప్రభుత్వం నుంచి అందుకోవడం సాధ్యమవుతుంది.సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఫోర్ సీటింగ్ సామర్థ్యంతో ప్రజా మరుగుదొడ్లు నిర్మించారు. సరైన నిర్వహణ కొరవడి వీటిల్లో రెండు (పురుషులు-1, మహిళలు-1) నిరుపయోగంగా మారాయి. పాల్వంచ పాత మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలోని మరుగుదొడ్డి ఏడాది కాలంగా నిరుపయోగంగా ఉంటోంది. ఇదే పట్టణం నవభారత్ అన్నపూర్ణ మెస్ ఎదురుగానున్న శౌచాలయం తలుపు మరమ్మతులకు గురైంది. దీంతో ఇదీ వినియోగంలో లేదు. కానీ, 2019లోనే వంద శాతం బహిరంగ మలవిసర్జన రహిత మున్సిపాలిటీగా (ఓపెన్ డేఫికేషన్ ఫ్రీ-ఓడీఎఫ్)గా ప్రకటించడం గమనార్హం. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు.

ఐదు అంశాల్లో తనిఖీలు అవసరం

1.సౌకర్యాల లభ్యత

మరుగుదొడ్ల లోపల తగినంత వెలుతురుండాలి. సీట్ల అవసరాలకు తగ్గట్టు నీరు సరఫరా చేయాలి. తలుపులకు తాళాలు బిగించాలి. వాష్ బేసిన్ ఏర్పాటు చేయాలి.

2.సురక్షితం

మహిళలు వినియోగించుకునే చోట.. ప్రాంగణం లోపల, వెలుపల సరైన కాంతి ఉండేలా చూడాలి. పీపీఈ కిట్ ధరించిన వ్యక్తి కాపలాగా ఉండాలి. ఫిర్యాదుల నమోదుకు ఏర్పాట్లు చేయాలి.

3.వేర్వేరు దారులు

శౌచాలయం లోపలకు వెళ్లేందుకు మహిళలు, పురుషులకు వేర్వేరు దారులు ఉండాలి. సులభ్ కాంప్లెక్స్ ఉన్నట్లు రహదారిపై సైన్‌బోర్డులు బిగించాలి. దివ్యాంగులకు తగిన సౌకర్యాలు కల్పించాలి.

4.శుభ్రత

అన్ని టాయిలెట్ సీట్లు ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలి. డస్ట్‌బిన్లు అందుబాటులో ఉంచాలి. కుళాయిలు లీకవకుండా మరమ్మతులు చేయాలి.

5.పర్యావరణ అనుకూలత

సోక్‌పిట్, మరుగు వెళ్లే సెప్టిక్ ట్యాంకుల అనుసంధానం సరిగా ఉండేలా చూసుకోవాలి. లీకేజీలతో పర్యావరణ కలుషితం సమస్య ఏర్పడుతుంది. సురక్షితమైన డిస్పోజల్ మిషన్ అందుబాటులో ఉంచుకోవాలి. అంతరాయం లేని నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చుకోవాలి. పట్టణంలోని ప్రజా మరుగుదొడ్ల నిర్వహణపై పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తాం. నిరుపయోగంగా ఉన్నవాటిని నిర్వహణలోకి తీసుకొచ్చేలా అధికారులను ఆదేశిస్తాను. మరుగుదొడ్ల శుభ్రతపై సంబంధిత నిర్వాహకులకు ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నాం. వాటి తనిఖీలను నిరంతరం చేయడం ద్వారా ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం.కొడారు సుజాత, పుర కమిషనర్, పాల్వంచ

## ఇసుకాసురుల బరితెగింపు

పాల్వంచ : నదులు, వాగుల పరీవాహకంలో ఇసుక తోడేళ్ల దందా యథేచ్ఛగా సాగుతోంది. కాసుల వేటలో కొందరు అక్రమార్కులు అధికారులపై దాడిచేసేందుకూ వెరవడం లేదు. ప్రభుత్వ శాఖల కళ్లుగప్పుతూ.. ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్న వైనం నివ్వెరబోయేలా చేస్తోంది. ముందస్తు సమాచారంతో అధికారులు వాహనాలను అడ్డగిస్తే దాడులకు బరితెగిస్తున్న వైనం జిల్లాలో చోటుచేసుకుంటోంది. మొన్న బూర్గంపాడు మండలంలో, తాజాగా పాల్వంచ మండలంలో ఇలాంటి ఘటనలు చేసుకోవడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. పాల్వంచ మండలం రంగాపురం గ్రామం వద్ద కిన్నెరసాని నుంచి పాల్వంచకు ట్రాక్టరుపై ఇసుకను అక్రమంగా తోలుతున్నట్లు అటవీ అధికారులకు సమాచారం అందింది. దీంతో నాగారం బీట్ ఎఫ్‌బీవో హరినాయక్ తన సిబ్బందితో కలిసి వెళ్లి ఆ ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. వాహనాన్ని అడితికి తరలించే క్రమంలో ట్రక్కుపై కూర్చున్నారు. మార్గం మధ్యలో కేశవాపురం వద్ద ట్రాక్టర్‌ను డ్రైవర్ ఓ వీధిలోకి మళ్లించి అక్కడే నిలిపివేశాడు. ఈ విషయం తెలుసుకున్న ట్రాక్టర్ యజమాని సమ్మయ్య, ఆయన తమ్ముడు సూర్య ఘటనా స్థలానికి వచ్చారు. ఎఫ్‌బీవోతో వాగ్వాదానికి దిగారు. ఇసుకను అక్కడే డంప్ చేసి వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. ట్రాక్టర్ ను అడితికి తరలించాల్సిందేని ఎఫ్‌బీవో అన్నారు. ట్రక్కు మీదనుంచి ఆయన కిందకు దిగకముందే.. డ్రైవర్ రోడ్డుపైనే ఇసుకను డంప్ చేశాడు. ఈ క్రమంలో కిందకు దిగే ప్రయత్నంలో హరినాయక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఇతర ఉద్యోగులు డయల్-100కు ఫోన్‌చేశారు. పోలీసులు రావడాన్ని గమనించిన సమ్మయ్య, అతని తమ్ముడు ట్రాక్టర్‌ను తీసుకుని అక్కడ్నుంచి పారిపోయారు. బాధిత అధికారి ఫిర్యాదుతో సమ్మయ్య, అతడి సోదరుడు, డ్రైవర్‌పై రేంజర్ సురేశ్ అటవీ శాఖ కేసు నమోదు చేశారు. వాహనాన్ని తమ కార్యాలయంలో అప్పగించాలని యజమానిని ఆదేశించారు. ఈ ఘటనపై అటవీ శాఖాధికారులు గ్రామీణం ఠాణాలో మంగళవారం ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

**ఆర్.ఐ.పై దాడి ఘటనలో.. 45 మందిపై కేసు**

అధికారుల విధులకు ఆటంకం కలిగించి, ఆర్.ఐ.పై దాడి చేసిన ఘటనపై బూర్గంపాడు పోలీస్ ఠాణాలో కేసు నమోదైంది.

# అపార్ కార్డు వివరాల నమోదులో ఆలసత్వం

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల్లో కేజీ నుంచి పదోతరగతి విద్యార్థులకు ఒకే గుర్తింపు కార్డు ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'అపార్' పేరుతో ఒన్ నేషన్– ఒన్ ఐడీ కార్డును ఇతర రాష్ట్రాల్లో జారీ చేస్తోంది. అపార్ కార్డులో విద్యార్థుల వివరాలను నమోదు చేసేందుకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అలసత్వం ప్రదర్శిస్తున్నాయి. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో అపార్ గుర్తింపు కార్డులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు అందించగా.. ఇక్కడ మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారు.

ఆధార్ తరహాలో.. ఆధార్ కార్డు తరహాలో విద్యార్థులకు ప్రత్యేకంగా 'అపార్'(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో కార్డును కేంద్ర విద్యాశాఖ కొన్ని నెలల నుంచి ఇస్తోంది. ఈ కార్డును జాతీయ సాంకేతిక విద్యా వేదిక (నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరం)కు అప్పగించింది. ఆధార్‌తో అపార్ కార్డు సంఖ్యను నమోదు




చేస్తే... విద్యార్థి పేరు, కుటుంబ వివరాలు, మార్కుల ధ్రువపత్రాలు అన్నీ తెలుసుకోవచ్చు ప్రవేశ పరీక్షలు రాసేప్పుడు ఈ సంఖ్యను నమోదు చేస్తే సరిపోతుంది.

**బహుళ ప్రయోజనాలు**

అపార్ కార్డు ద్వారా విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు లభించనున్నాయి. ఈ కార్డుపై ఉన్న నంబర్‌ను కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖల వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే చాలు.. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకూ ఎక్కడ చదివారన్న వివరాలు తెరపై ప్రత్యక్షమవుతాయి. అపార్ వివరాలను అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ) అనే ఎడ్యులాకర్‌కు అనుసంధానించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఈ విషయాలన్నీ తెలిసినా అపార్‌లో విద్యార్థుల వివరాల నమోదును పక్కన పెట్టేశారు. దీంతో హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలు ఈ ప్రక్రియలో చివరాఖరున నిలిచాయి.

# తప్పు ఒకరిది.. వివరణ మరొకరిది

కూకట్‌పల్లి: సహజంగా ప్రభుత్వ శాఖల్లో, విశ్వవిద్యాలయాల్లో తప్పు ఎవరు చేస్తే వారికి మెమో జారీ చేయడం చూస్తుంటాం. ఉన్నతాధికారులు సంబంధిత విభాగాధిపతి లేదా బాధ్యుడిని అడగడం.. ఆయన తప్పు చేసిన వారిని వివరణ కోరడం సహజంగా జరిగే ప్రక్రియ. కానీ, ఇక్కడ తప్పు చేసిన వారిని వదిలేసి.. మరి కొందరికి ఆఘమేఘాలపై మెమోలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ మూడో ఏడాది రెగ్యులర్, ఐడీపీ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఎక్స్‌టర్నల్ 10మార్కులు కలపాల్సిన ఫ్యాకల్టీ తప్పిదంతో మైనస్ అయ్యాయి. దీంతో కొంతమంది విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో తప్పి గగ్గోలు పెట్టడంతో యూనివర్సిటీ అధికారులు, కళాశాల ఫ్యాకల్టీ నాలుక్కరుచుకోవడం తెలిసిందే. ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకురావడంతో ఇన్‌ఛార్జి వీసీ బుర్రా వెంకటేశం వర్సిటీ అధికారుల ను వివరణ కోరారు. దీంతో రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి కళాశాల ప్రిన్సిపల్,



వైస్ ప్రిన్సిపల్, సీఎస్‌ఈ విభాగాధిపతి, పరీక్షల విభాగం ఇన్‌ఛార్జికి మెమోలు జారీ చేశారు.

**ఫ్యాకల్టీకి మినహాయింపులో ఆంతర్యమేమిటీ?:** కళాశాల మొత్తానికి ప్రిన్సిపల్ హెడ్‌గా, తర్వాత వైస్ ప్రిన్సిపల్ బాధ్యులుగా ఉంటారు. వీరిద్దరికి మెమోలు జారీ చేయడం బాగానే ఉంది. కళాశాలలో అంతర్భాగమైన సీఎస్‌ఈ విభాగాధిపతి, పరీక్షల ఇన్‌ఛార్జికి సైతం మెమోలు జారీచేసినప్పటికీ.. అసలు ఈ మొత్తం వ్యవహారానికి కారకులైన ఫ్యాకల్టీని మినహాయించడం వెనుక ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. ఫ్యాకల్టీ కళాశాలలో అంతర్భాగం కాగా.. ప్రిన్సిపల్ చూసుకుంటారన్నప్పుడు.. మరి విభాగాధిపతి, కళాశాల పరీక్షల ఇన్‌ఛార్జి కూడా అందులోనే ఉంటారన్నది గమనార్హం.

వారికి కూడా ఇస్తాం.. ఫ్యాకల్టీకి మెమోలు ఇవ్వకపోవడంపై ప్రశ్నించగా బాధ్యులందరిపై చర్యలుంటాయని జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు.

# చలితో వంటగ్యాస్‌కు డిమాండ్

హైదరాబాద్ : చలి తీవ్రత నానాటికీ పెరుగుతుండటంతో గ్రేటర్‌లో వంటగ్యాస్ వినియోగం అదే స్థాయిలో పెరుగుతోంది. సాధారణ రోజులతో పోలిస్తే ఈ సీజన్‌లో రోజువారీ సిలిండర్ల రీఫిల్లింగ్ బుకింగ్ సంఖ్య 10శాతం పెరిగింది. మున్ముందు మరింత పెరిగే అవకాశముంది. విద్యుత్ గీజర్లు, హీటర్ల వినియోగంతో కరెంటు బిల్లుల మోతతో బెంబేలెత్తిపోతున్న సామాన్యులు గ్యాస్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం స్నానాలకు గ్యాస్ స్టౌపైనే నీళ్లు వేడి చేయడం, కాచి చల్లార్చిన నీరు తాగడం, కషాయాల తయారీ కోసం వంట గ్యాస్‌ను వినియోగిస్తున్నారు. దీంతో గ్యాస్ వినియోగం అమాంతం పెరిగింది. గ్రేటర్ పరిధిలో 40లక్షలకు పైగా గ్యాస్ వినియోగదారులుండగా సాధారణ రోజుల్లో రోజూ 90వేల రీఫిల్ సిలిండర్లు బుక్ అయ్యేవి. చలి తీవ్రతతో ఈ సంఖ్య లక్షకు చేరింది. ఈ సీజన్‌లోనే కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవ్వడం గమనార్హం. వరకు సగటున 15 నుంచి 17 డిగ్రీల మధ్య నమోదవగా పటాన్‌చెరులో అత్యల్పంగా 12.4 డిగ్రీలు నమోదైంది.

**ఈ సీజన్‌లోనే అత్యల్పం...:** ఈ సీజన్‌లోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గ్రేటర్‌లోని ఇతర కేంద్రాలతో పోలిస్తే పటాన్‌చెరులో సోమవారం అత్యల్పంగా 12.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాజేంద్రనగర్‌లో 13.3, హకీంపేట 15.5, హయత్‌నగర్ 16.6, హైదరాబాద్ 17.5, దుండిగల్‌లో 17.8 డిగ్రీలు నమోదైంది.

గ్రేటర్ పరిధిలో వంటగ్యాస్ కనెక్షన్లు.. హైదరాబాద్ 16,17,781మేడ్చల్ మల్కాజిగిరి 11,74,785 రంగారెడ్డి జిల్లా 12,48,928

# ఈ - వాహనం ఆదాకు వాహకం



సిద్దిపేట : 'కొత్త వాహనం ఏ కంపెనీది కొనుగోలు చేస్తారో మీ ఇష్టం. విద్యుత్తుతో నడిచేదే కొనండి, భవిష్యత్తుతరాలను కాలుష్యం నుంచి రక్షించండి..' అంటూ తాజాగా జరిగిన సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. పెరుగుతున్న చమురు ధరలను అధిగమించడం సహా పర్యావరణ హితాన్ని కాంక్షించే ఎంతోమంది ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. విద్యుత్తు వాహనాలపై రోడ్డు ట్యాక్సు, రిజిస్ట్రేషన్ రుసుము శత శాతం మినహాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరింత మందికి మేలు చేకూర్చనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో పరిస్థితిపై కథనం.

ఉరుకులు, పరుగులమయంగా మారిన ప్రస్తుత తరుణంలో ప్రతి ఇంటా వాహనం అనివార్యమైంది. సామాన్యుడి నుంచి సంపన్నుడి వరకు వినియోగిస్తుండటం పరిపాటే. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాల్లో వ్యాపార, వాణిజ్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో అదేస్థాయిలో వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. మరోవైపు పెరుగుతున్న వాహన కాలుష్యం హెచ్చరికలను జారీ చేస్తోంది. ఈ తరుణంలో విద్యుత్తు వాహనాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాయి.

**పెరిగిన వినియోగం:** పెరుగుతున్న కాలుష్యం, భారంగా మారుతున్న ఇంధన ధరలు, ఇతర కారణాలతో వాహనదారులు వాటి వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ఈ–బైకు, కార్లు, ఆటోలు, సరకు రవాణా వాహనాల వినియోగం నాలుగు జిల్లాల్లో పెరుగుతోంది. వ్యాపార, వాణిజ్య సంస్థలు వీటిపై ఆసక్తి చూపుతున్నాయి.

**రిజిస్ట్రేషన్ ఇలా..**

250 వాట్ల కంటే తక్కువ శక్తి, గంటకు 25 కి.మీ. కంటే తక్కువ వేగం ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్ అవసరం ఉండదు. ఆపై సామర్థం ఉన్న వాటిని మాత్రం రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందే.

**ఛార్జింగ్ స్టేషన్లు పెంచితే..**

పెట్రోలు ధరల పెంపుతో ఆటోవాలాలు ఛార్జింగ్ వాహనాల వైపు మళ్లుతున్నారు. సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేసి కాలం చెల్లిపోవడం, వాహన జీవిత కాలం గడువు ముగిసి తుక్కు కింద మార్చి ఆ ధ్రువపత్రం చూపిస్తే దానిపై అదనపు రాయితీ అందుతుండటంతో కొనుగోళ్లకు మరింత మంది ముందుకొస్తున్నారు. తాజాగా రోడ్ ట్యాక్సు, వాహన రిజిస్ట్రేషన్ రుసుము మినహాయింపుతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ–బైక్‌లు రూ.60 వేలు మొదలు రూ.2లక్షల వరకు అందుబాటులో ఉన్నాయి. ధరల్లో రాయితీలు కల్పించడం సహా ఈ–ఛార్జింగ్ స్టేషన్‌లను పెంచితే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది.

వికారాబాద్ మండలం ఎన్నెపల్లికి చెందిన దీపిక ప్రైవేటు కళాశాలలో చదువుతున్నారు. ఈబైక్ కొనుగోలు చేసి నిత్యం కళాశాలకు దానిపై వెళ్లివస్తున్నారు. అంతకుముందు పెట్రో వాహనం వినియోగించగా ప్రతి నెలా రూ.2500 వరకు ఖర్చుపెట్టేవారు. ఇప్పుడు రూ.600 వరకు ఛార్జింగ్‌కు ఖర్చువుతోంది. నాలాంటి వారికి అనుకూలంగా ఉన్నాయని, సాధారణ వాహనాలతో పోలిస్తే నిర్వహణ, కాలుష్యరహితంగా ప్రయాణం సాగుతోందని చెబుతున్నారు దీపిక.

వికారాబాద్‌కు చెందిన మల్లేశం రెండేళ్లుగా ఈ–వాహనాన్ని వినియోగిస్తున్నారు. తన అవసరాల నిమిత్తం దీన్ని కొనుగోలు చేశారు. ఒక్కసారి ఛార్జింగ్ పెడితే రెండు రోజుల వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాన్ని నడిపిస్తున్నారు. గతంలో ప్రతి నెలా రూ.2000 వేల వరకు పెట్రోల్‌కు ఖర్చుపెట్టేవారు. ఇప్పుడా ఖర్చులు తప్పాయి. మరమ్మతుల బాధ కూడా తప్పిందని చెబుతున్నారాయన.

# స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే రుడా?




గోదావరిఖని : జిల్లాలో రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా)ని స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే ఏర్పాటు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న పరిణామాలు.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రజాప్రతినిధులు ప్రస్తుతానికి రుడా ఏర్పాటు అంశాన్ని పక్కన పెట్టేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. రుడాను ఆమోదిస్తూ అక్టోబరులో ఆదేశాలు జారీ అయ్యాయి. అందుకు సంబంధించిన కసరత్తు ప్రారంభించాల్సి ఉండగా త్వరలో పుర, నగరపాలక ఎన్నికలతో పాటు జిల్లా, మండల ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉంది. రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా)పై జిల్లాలో వివాదం తలెత్తింది. రుడాకు బదులు పుడా(పెద్దపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేయాలని పెద్దపల్లి ప్రజలు కోరుతున్నారు.

**పలు గ్రామాలను కలపడంతో ఇబ్బంది**

జిల్లాలో 14 మండలాల్లోని 198 గ్రామాలను రుడాలో విలీనం చేశారు. దీంతో మిగతా ప్రాంతాలకు చెందిన వారి నుంచి తమ ప్రాంతం పేరుతో సైతం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ మొదలైంది. తాజాగా పెద్దపల్లి పట్టణంలో ఐక్య కార్యాచరణ కమిటీని నియమించారు. పుడా ఏర్పాటు చేయాలని వివిధ వర్గాలకు చెందిన వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా రెండు పేర్లు కాకుండా రామగిరి పేరుతో ఏర్పాటు చేస్తామన్న అభిప్రాయాన్ని మంత్రి వ్యక్తం చేశారు. ఇటు అధికార పార్టీలో రుడాపై చాలా మంది నాయకులు ఆశలు పెంచుకున్నారు. నామినేటెడ్ పదవి వస్తుందన్న ఆశతో ఎవరికి వారు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రస్తుతం జిల్లాలో మూడు పురపాలక సంఘాలు, ఒక నగరపాలక సంస్థ ఉండటంతో వాటికి ఎన్నికలు నిర్వహించిన తర్వాతే రుడా ఏర్పాటుపై వేగం పెంచాలని నేతలు భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు రుడా ఏర్పాటు చేయడం ద్వారా నామినేటెడ్ పదవి విషయంలో ఎవరి వైపు మొగ్గు చూపినా మిగతా వారి నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉంది. ఈ కారణంగా ప్రస్తుతానికి ఎలాంటి చర్యలు చేపట్టకుండా సమయం తీసుకోవాలని భావిస్తున్నారు. డిసెంబరుతో పుర, నగరపాలక సంస్థల పాలకవర్గాల గడువు ముగుస్తుంది. జనవరిలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో అవి పూర్తయిన తర్వాతే ఏర్పాటు చేస్తే మేలన్న అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం.

# ఆగుతూ.. సాగుతూ



సిరిసిల్ల : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాగులపై చేపట్టిన చెక్ డ్యాంల నిర్మాణాలు పూర్తి కావడం లేదు.. పూర్తయితే భూగర్భ జలాలు పెరిగి వేలాది ఎకరాలకు లాభం చేకూరే అవకాశమున్నా వివిధ కారణాలతో పనులు ముందుకు సాగడం లేదు.. పూర్తయిన వాటిలోనూ కొన్ని వరదలకు ధ్వంసమై ఉపయోగం లేకుండా పోయాయి.. అధికారులు స్పందించి వెంటనే వాటికి మరమ్మతులు చేయడంతోపాటు కొత్తవాటి నిర్మాణం ప్రారంభిస్తే రైతులకు లబ్ధి చేకూరనుంది..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాగులపై 2018–19లో 114 చెక్‌డ్యాంలకు నీటిపారుదలశాఖ ప్రతిపాదించింది. 2020లో రెండు విడతలుగా 72 మంజూరయ్యాయి. వీటిలో నాలుగు జిల్లాల్లో 57 చెక్‌డ్యాంల పనులు ప్రారంభమయ్యాయి. అవికూడా నాలుగేళ్లుగా ఆగుతూ.. సాగుతూ అసంపూర్తి దశలో ఉన్నాయి. అన్నిచోట్లా ఒకే నమూనా.. రెండు వైపులా రక్షణ గోడల్లేక, నిర్మాణ దశలోనే ఏడు చెక్ డ్యాంలు వరదలకు కొట్టుకుపోయాయి. ప్రత్యేక నిపుణుల బృందం కొట్టుకుపోయిన చెక్‌డ్యాంలను పరిశీలించింది. నమూనాలను మార్చి నిర్మించాలని 2023లో ఆయా జిల్లాల నీటిపారుదలశాఖ అధికారులకు సూచించింది. ప్రతిపాదనలు మార్చడంతో నిర్మాణ వ్యయం మారుతుందని చాలాచోట్ల గుత్తేదారులు ముందుకు రాలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి.

**ఆరు నెలలే సమయం**

అసంపూర్తి నిర్మాణాలను, మరమ్మతు చేయాల్సిన వాటి పనులు ఇప్పుడే ప్రారంభిస్తే వానాకాలంలోగా పూర్తవుతాయి. ఇందుకు ఆరు నెలలే సమయముంది. ఆలస్యం చేస్తే వర్షాకాలం ప్రారంభమైతే ఈ ఏడాదీ పనులు ముందుకు సాగని పరిస్థితి. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వాటికి సంబంధించి గుత్తేదారులు 2021లోనే ఒప్పందాలు చేసుకున్నారు. కాంక్రీటు పనులు అసంపూర్తిగా ఉన్నచోట వరదలకు కొట్టుకుపోయాయి. వీటికి తిరిగి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం.. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా ఆలస్యమవుతోంది. పనుల ఒప్పందం తర్వాత తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలి. కానీ ఇప్పటికీ ఒక్కో గుత్తేదారుకు మూడుసార్లు గడువు పొడిగిస్తూ వచ్చారు. 52 చెక్‌డ్యాంలకు గాను ప్రభుత్వం రూ.287.95 కోట్ల మేర చెల్లింపులు చేసింది.

పనులపై రాజన్న సిరిసిల్ల జిల్లా ఈఈ అమరేందర్‌రెడ్డితో మాట్లాడగా అసంపూర్తి దశలో ఉన్నవి, కొట్టుకుపోయిన చోట ఇటీవల పనులు ప్రారంభించేలా గుత్తేదారులకు సూచిస్తున్నామన్నారు. పనుల కోసం పూడిక తీస్తుంటే నీటి ఊటలు వచ్చి ఆటంకం కలుగుతుందని, ఒప్పందం చేసుకున్న వారు పనులు పూర్తి చేసి శాఖకు అప్పగించేవరకు వారిదే బాధ్యత అని పేర్కొన్నారు. చాలా వాటికి గడువులు పొడిగిస్తూ వచ్చామని, వర్షాకాలం ప్రారంభంలోగా అన్ని చెక్‌డ్యాంలు పూర్తి చేయాలని ఆదేశించామని చెప్పారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మానేరు, మూలవాగులపై 24 చెక్ డ్యాంలు మంజూరైతే 8 చోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. పది చోట్ల పనులు చివరి దశలో ఉన్నాయి. వెంకట్రావుపేట, జయవరం, మల్లారం, మహాలక్ష్మి ఆలయం, మామిడిపల్లిలో ప్రారంభ దశలో ఉన్నాయి. మానేరుపై సిరిసిల్ల సాయినగర్‌లో రెండేళ్ల క్రితం కొట్టుకుపోయిన చెక్‌డ్యాం పనులు ప్రారంభంకాలేదు.

కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో మానేరుపై గట్టెపల్లి, వీణవంక మండలంలో కోర్‌కల్ చెక్‌డ్యాంలు అసంపూర్తి దశలో ఉన్నాయి.

జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైన గ్రామంలో చెక్‌డ్యాం కోతకు గురైంది. ఇదే మండలంలో మరో నాలుగుచోట్ల అసంపూర్తి నిర్మాణాలు ఉన్నాయి. శంకరపట్నం మండలం కల్వలలో చాలా ఏళ్ల కిందట నిర్మించిన చెక్‌డ్యాం గతేడాది వరదలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీనికి రూ.60 కోట్లతో ఇటీవల ప్రతిపాదనలు పంపారు. రక్షణగోడల నిర్మాణాలకు పదిశాతం ప్రతిపాదనలు పెంచి పంపారు. వీటికి నిధులు మంజూరుకావాల్సి ఉంది.

# గల్ఫ్ కుటుంబాలకు ఆసరా

మేడిపల్లి : ఉపాధి వేటలో ఊపిరి వదిలిన కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందించనుంది. ఇన్నాళ్లు ఆపన్న హస్తం కోసం ఎదురుచూసిన గల్ఫ్ కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలకు ఆసరా లభించనుంది. ప్రభుత్వం ఎన్నికల హామీలో ప్రకటించినట్లుగా రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా పంపిణీకి ఏర్పాట్లు చేసింది. ఈ నెల 20న వేములవాడలో పర్యటించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన 17 గల్ఫ్ మృతుల కుటుంబాలకు చెక్కులు అందించనున్నారు.

**నెరవేరిన ఎన్నికల హామీ**



అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో గల్ఫ్ కార్మికుల సంక్షేమం, ఎన్నారైల సంక్షేమం కోసం హామీలు ఇచ్చింది. పలు సందర్భాల్లో గల్ఫ్ కార్మికుల కుటుంబీకులు, కార్మిక సంఘాలు, గల్ఫ్ జేఏసీ సభ్యులు ఆయా గల్ఫ్ దేశాల్లో మృతులు ఎక్కువగా ఉంటున్నారనీ, వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాల నాయకులతో ప్రభుత్వ ప్రతినిధులు చర్చించారు. సెప్టెంబరు 16న 205 జీవోను విడుదల చేస్తూ గల్ఫ్ కార్మిక కుటుంబాల్లో మృతిచెందిన వారికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో కార్మిక కుటుంబాల్లో సంతోషం వ్యక్తమైంది. ఈ నెల 20న సీఎం వేములవాడ పర్యటనకు రానున్న నేపథ్యంలో 17 మంది రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన గల్ఫ్ దేశాల మృతుల కుటుంబీకులకు ఎక్స్‌గ్రేషియా కింద ప్రభుత్వం రూ.85 లక్షలు విడుదల చేసింది.

# సంస్కరణలతో మెరుగైన సేవలు

జగిత్యాల : విద్యుత్తు శాఖ కొద్ది నెలలుగా సంస్కరణలకు శ్రీకారం చుట్టింది.. సమస్యలను పరిష్కరించటం, నిరంతరాయంగా సరఫరా కొనసాగించటంతోపాటు అవినీతి నిర్మూలనకు టోల్ ఫ్రీ నంబరు.. సమస్య వచ్చినప్పుడు సంస్థకు తెలియజేసేలా నియంత్రికలపై టోల్‌ఫ్రీ నంబరు ముద్రించటంతోపాటు రైతు సమస్యలను గుర్తించేందుకు పొలంబాట కొనసాగిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో మరమ్మతు చేయాల్సి వస్తే సరఫరా నిలిపివేయకుండా పనులు చేసేందుకు సంస్థ శ్రీకారం చుట్టింది. టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీగా వరుణ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత చేపట్టిన సంస్కరణలతో వినియోగదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. జిల్లాలో మొత్తం 5,04,252 విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహ కనెక్షన్లు 3,21,776 ఉండగా వ్యవసాయ కనెక్షన్లు 1,33,880 ఉన్నాయి.

**సరఫరా నిలిపి వేయకుండానే మరమ్మతు**

శనివారం వచ్చిందంటే ఉప కేంద్రాల పరిధిలో నిర్వహణ పనులు చేపడతారు. సరఫరా ఉండదని వినియోగదారులు బావిస్తుంటారు. ఇక నుంచి సరఫరా నిలిపివేయకుండానే మరమ్మతు చేపట్టనున్నారు. ప్రతి ఉప కేంద్రం పరిధిలో ఏబీ స్విచ్‌లు బిగిస్తున్నారు. ఇందుకోసం నిధులు కేటాయించారు. ఏబీ స్విచ్ అమర్చటంతో ఒక ఉప కేంద్రంలో మరమ్మతు పనులు చేస్తే అక్కడి వరకు సరఫరా నిలిపివేసి మరో ఉప కేంద్రం నుంచి సరఫరా కొనసాగిస్తారు. పనులు పూర్తి కాగానే ఎప్పటిలాగే ఏబీ స్విచ్ ద్వారా సరఫరా పునరుద్ధరిస్తారు. దీని ఫలితంగా ఎక్కడ సమస్య వచ్చినా ఆ ప్రాంతంలో మాత్రమే సరఫరా నిలిచిపోనుండగా మిగతా ప్రాంతాలకు సరఫరా కొనసాగనుంది.

**పొలంబాటతో రైతుల సమస్యల గుర్తింపు..**

జిల్లాలో కొద్ది రోజులుగా విద్యుత్తు అధికారులు పొలం బాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎస్‌ఈ, డీఈ, ఏడీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది రైతుల పొలాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తూ సమస్యలను




నమోదు చేస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు నియంత్రికలకు రక్షణ చర్యలు తీసుకోవటం, దిమ్మెలను ఎత్తు పెంచటం, స్తంభాలను సరిచేస్తున్నారు. వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు అమర్చటం తదితర పనులు చేపడుతున్నారు.

**తెలుగులోనే పత్రాలు, సందేశాలు**

రైతులకు సంబంధించి విద్యుత్తు పనులు చేసేందుకు ముందుగా అంచనా వేస్తారు. ఇవి ఇప్పటివరకు ఆంగ్లంలో ఉండగా రైతులకు అర్థమయ్యే విధంగా ఇక నుంచి తెలుగులోనే ముద్రించనున్నారు. చరవాణులకు వచ్చే సందేశాలు సైతం తెలుగులోనే పంపేందుకు సంస్థ నిర్ణయం తీసుకుంది.

**అనిశా టోల్‌ఫ్రీ నంబరు 92810 33233**

విద్యుత్తుశాఖలో పని చేస్తున్న కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారి వరకు ఎవరూ లంచం అడగరాదు ఇస్తే తీసుకోరాదని సంస్థ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం అనిశా టోల్ ఫ్రీ నంబరు అన్ని కార్యాయాల్లోనూ ముద్రించి వినియోగదారులకు తెలిసేలా ఏర్పాటు చేశారు. పోస్టర్ ఏర్పాటుతో అవినీతికి పాల్పడే సిబ్బంది అధికారుల్లో భయం నెలకొనగా గతంలో కంటే ప్రస్తుతం కొంత అవినీతి తగ్గినట్లుగా భావిస్తున్నారు. నియంత్రికలపై టోల్‌ఫ్రీ నంబరు.. ఏ సమస్య వచ్చినా సంస్థకు తెలియజేసేందుకు 1912 టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేశారు. టోల్‌ఫ్రీ నంబరును జిల్లాలో ఉన్న ప్రతి విద్యుత్తు నియంత్రికలపై ముద్రించనున్నారు. దీంతో సమస్య వచ్చినప్పుడు వెంటనే నంబరకు సమాచారం అందించే వీలుంటుందని సంస్థ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే జిల్లాలో ముద్రణ కార్యక్రమం పూర్తి కానున్నట్లు ఎస్‌ఈ తెలిపారు.

**నాణ్యమైన విద్యుత్తు సరఫరా - సాలియానాయక్, ఎస్‌ఈ**

వినియోగదారులకు మెరుగైన నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నాం. రైతుల వద్దకు వెళ్లేందుకు పొలం బాట కార్యక్రమం చేపట్టాం. ప్రతి నియంత్రికపై టోల్‌ఫ్రీ నంబరు ముద్రణ, నిరంతర సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం. వీటి ఫలితంగా వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతున్నాయి.

# సుడా కుర్చీకి పోటాపోటీ

ఖమ్మం: స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పాలకవర్గం ఎంపిక ప్రక్రియ దసరా నాటికీ కొలిక్కి వచ్చేలా కనిపించటం లేదు. ఛైర్మన్ గిరి రేసులో చాంతాడంత జాబితా ఉండటంతో సుడా కుర్చీ ఎవరికి కట్టబెట్టాలన్న అంశం ఇప్పుడు అధికార పార్టీకి తలనొప్పిగా మారింది. వాస్తవానికి విజయదశమి పండగ నాటికి పదవులు భర్తీ చేయాలనుకున్నప్పటికీ పోటీ తీవ్రంగా ఉండటంతో చర్చలు ఎడతెగటం లేదన్న వాదన వినిపిస్తోంది.

కొలిక్కిరాని కసరత్తు

రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ కొలువుల జాతర కొనసాగుతోంది. ఇప్పటికే తొలిదఫా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు భర్తీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల వారీగా పదవుల పందేరంపై ప్రత్యేక దృష్టి సారించింది. శాసనసభ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేసిన నాయకులకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే రెండ్రోజుల క్రితం కొన్ని జిల్లాలకు గ్రంథాలయ సంస్థ ఛైర్మన్లను ప్రకటించింది. కొన్ని జిల్లాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు పాలకవర్గాలను నియమించింది. స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) పాలకవర్గం ఎంపికపై మూడు, నాలుగు నెలల నుంచే కసరత్తు జరుగుతున్నా ఆశావహులు ఎక్కువగా ఉండటంతో ఎటూ తేలటం లేదు. ప్రధానంగా ఖమ్మం కేంద్రంగా కార్యకలాపాలు సాగించే 'సుడా'కు పాలకవర్గం లేక దాదాపు తొమ్మిది నెలలవుతోంది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇక్కడి నుంచే




ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వైరాతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర, పాలేరు నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాలు సుడా పరిధిలోకి వస్తుండటంతో ఛైర్మన్ గిరికి వీరి ఆమోదం కీలకంగా మారింది. అమాత్యులు వేర్వేరు పేర్లు సూచిస్తుండటంతో ఛైర్మన్ ఎంపిక ప్రక్రియ ఆలస్యమవుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆమాత్యుల ఆమోదమే కీలకం

గతంలో ఖమ్మం నియోజకవర్గానికి ఛైర్మన్ పదవి దక్కినందున ఈసారి మరో శాసనసభ స్థానం వారికి అవకాశమివ్వాలని పలువురు నేతలు పట్టుబడుతున్నారు. అయితే.. స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యకలాపాలన్నీ ఖమ్మం కేంద్రంగానే సాగుతుండటం, సుడా పరిధి ఎక్కువ ఖమ్మం నియోజకవర్గంలోనే ఉండటంతో ఇక్కడి నాయకులకే ఛైర్మన్ పదవి ఇవ్వాలనే వాదనను మరికొందరు వినిపిస్తున్నారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కమర్తపు మురళి, ఎండీ జావెద్, సాధు రమేష్‌రెడ్డి, నాగండ్ల దీపక్‌చౌదరి, మిక్కిలినేని నరేందర్, వద్దెబోయిన నర్సింహారావు, చావా నారాయణరావు, వద్దే నారాయణరావు తదితరులు ఛైర్మన్ పదవిపై గంపెడాశలు పెట్టుకున్నారు. ఛైర్మన్, పదకొండు మంది డైరెక్టర్లతో పాలకమండలి ఏర్పాటుకు అవకాశముంది. దసరా పండగ నాటికి సుడా పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటిస్తుందని తొలుత భావించినా.. ఎంపిక ప్రక్రియ ఆలస్యమవుతుందని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఆశావహులు అధిక సంఖ్యలో పోటీపడుతుండటం, ముగ్గురు మంత్రులకు ఆమోదయోగ్యమైన వ్యక్తికి కుర్చీ కట్టబెట్టాల్సి రావటంతో జాప్యం జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# పద్దు.. తారుమారు..!

నల్గొండ : నల్గొండకు చెందిన నరేష్‌కుమార్ చిరు ఉద్యోగి. కొద్దిపాటి వేతనంతో కుటుంబ జీవనం సాగిస్తున్నారు. ప్రతి నెల ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, ఇతర అవసరాలకు ప్రణాళిక పద్ధతిలో ఖర్చులు వెచ్చిస్తుంటారు. కొద్ది రోజులుగా, కూరగాయల ధరలతో లోటు బడ్జెట్ ఎదుర్కొంటున్నారు. గత వారం రోజుల్లోనే నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరగడంతో అదనంగా రూ.రెండు వేల నుంచి రూ.మూడు వేల వరకు ఆర్థిక భారం పెరగడంతో నరేష్ లాంటి మధ్య తరగతి కుటుంబాలు ఆర్థిక పరమైన ఇబ్బందులతో సతమతమవుతున్నాయి. దసరా పండగ వేళ బియ్యం, కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. మార్కెట్లల్లో వ్యాపారులు, దళారుల రాజ్యం నడుస్తోంది. గడిచిన వారం రోజుల్లోనే టమాట ధర నాలుగు రెట్లు పెరిగింది. ఒక కిలో రూ.25 లభించగా, ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.100కు చేరుకుంది. దాని వెనుకాలే ఉల్లి, వెల్లుల్లితోపాటు మిగతా కూరగాయల ధరలు పరుగులు పెడుతున్నాయి. మరో పక్క సన్న బియ్యం క్వింటాల్



గత ఏడాది రూ.5600వరకు ఉండగా ప్రస్తుతం రూ.6200 నుంచి రూ.7 వేల వరకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఇక కంది పప్పు, పెసర, శనగ పప్పులు ఒక కిలోపై రూ.5 నుంచి రూ.40 వరకు అదనంగా పెరిగాయి.

పండగల సీజన్‌లో ఒక్కసారే నూనెల ధరలకు రెక్కలొచ్చాయి. గత నెలలో కిలో రూ.110 ఉన్న నూనె ప్రస్తుతం కిలో రూ.135 వరకు చేరింది. అంటే ఒక కిలోపై రూ.20 అదనంగా పెరిగింది. దీంతో 5 కిలోలు వాడుతున్న కుటుంబాలు 3 కిలోలకు తగ్గించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో ఐదు లక్షలకు పైగా కుటుంబాలున్నాయి. నెలకు 2.5 లక్షల లీటర్ల నూనె వినియోగం ఉంటుందని వ్యాపారుల అంచనా. ఈ లెక్క ప్రకారం రూ.9 కోట్ల ఆర్థిక భారం పడుతుంది. పర్వదినాలు రావడంతో పిండి వంటలకు నూనె వినియోగం తప్పని సరి కావడంతో ఏం చేయాలన్న మీమాంసలో ప్రజలు పడిపోయారు.

# అద్దెల ఆదాయం.. దళారుల భోజ్యం



పెద్దపల్లి: ప్రభుత్వ సంస్థలకు చెందిన దుకాణ సముదాయాలు దళారులకే కాసులు కురిపిస్తున్నాయి. ఏళ్ల కిందట గదులు చేజిక్కించుకున్న వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరకు ఇతరులకు అద్దెకు ఇస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అద్దె పెంపునకు పలుమార్లు ప్రయత్నాలు జరిగినప్పటికీ రాజకీయ కారణాలతో కార్యరూపం దాల్చలేదు. పెద్దపల్లిలోని పురపాలిక వాణిజ్య భవన సముదాయంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల వాణిజ్య సముదాయానిదీ ఇదే పరిస్థితి. ఇటీవల మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డుకు సంబంధించిన అద్దె గదులు అధిక రేట్లకు పలకడంతో మరోసారి వాణిజ్య సముదాయం అద్దెలు చర్చనీయాంశమయ్యాయి.

నిలిచిన వేలం ప్రక్రియ

పెద్దపల్లి మున్సిపాలిటీకి కూరగాయల మార్కెట్‌లో జెండా రోడ్డువైపు 20 గదులతో వాణిజ్య సముదాయముంది. పాతికేళ్ల కిందట నిర్మించిన భవనంలో గదులను గతంలో టేలాలు వేసుకున్న వారికి కేటాయించారు. అందులో మెజారిటీ గదులను ఇతరులకు అద్దెకిచ్చారు. పురపాలికలకు నామమాత్రంగా అద్దె చెల్లిస్తూ ఇతరుల నుంచి నెలకు రూ.10 వేల చొప్పున తీసుకుంటున్నారు. గతంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు పలుమార్లు అద్దెను సవరించారు. గతేడాది పెంచిన అద్దెను గదుల యజమానులు చెల్లించకపోవడంతో తిరిగి వేలం నిర్వహణకు అధికారులు నోటీసులు జారీ చేశారు. రాజకీయ కారణాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. దీనిపై ఫిర్యాదు స్వీకరించిన అదనపు కలెక్టర్ అరుణశ్రీ గదుల అద్దె పెంపుపై కీలక ఆదేశాలు జారీ చేయడంతో మున్సిపల్ అధికారులు కార్యాచరణ చేపట్టారు.

వ్యవసాయ మార్కెట్ భవనం స్ఫూర్తి

పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లోని వాణిజ్య సముదాయంలోని 15 గదులకు ఇటీవల మార్కెటింగ్ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. ఒక్కో గది కనిష్ఠంగా రూ.19 వేలు, గరిష్ఠంగా రూ.26 వేల వరకు పలికింది. ఈ వేలం స్ఫూర్తితో కూరగాయల మార్కెట్ వాణిజ్య సముదాయం ధరల సవరణకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

గడువు ముగిసినా పాత లెక్కనే!

పెద్దపల్లి బాలుర జూనియర్ కళాశాల భవనానికి రాజీవ్ రహదారి వైపు 2004లో 24 గదులతో వాణిజ్య భవన సముదాయం నిర్మించారు. అప్పట్లో ఒక్కో గదికి రూ.50 వేల చొప్పున అడ్వాన్సు ఇచ్చి దక్కించుకున్న వ్యక్తులు ప్రతి నెలా రూ.500 చొప్పున కళాశాల యాజమాన్య కమిటీకి చెల్లించాల్సి ఉంటుంది. ఏటా 5 శాతం అద్దె పెంపు, పదేళ్లకోసారి రీషెడ్యూలు చేయాలి. 2014లో రీ షెడ్యూలు చేయగా గత మార్చితో పదేళ్ల గడువు ముగిసింది. గదులను అద్దెకు తీసుకున్నవారు వాటిని తమకు కేటాయించాలని, ఇందుకోసం రీ టెండర్ నిర్వహించాలని అభ్యర్థించారు. అధికారులు ఏ నిర్ణయమూ తీసుకోలేదు. ఒకవేళ రీషెడ్యూలు చేసినా మున్సిపల్ అధికారులు మార్కెట్ సర్వే చేసి, నిర్ణయించిన దానిపై 15 శాతం పెంచి అద్దె నిర్ణయించాలి. ఇవేవీ లేకుండానే ఆరు నెలలు గడిచిపోయాయి.

రీ టెండరుకు ప్రతిపాదనలు కళాశాల భవన సముదాయం గదుల రీ టెండరు నిర్వహణకు రాష్ట్ర ఉన్నతవిద్యా మండలి కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించాం. అక్కడి నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో గతంలో మాదిరిగానే పది శాతం అద్దె పెంచి తీసుకుంటున్నాం. ఇది కూడా తాత్కాలిక పద్ధతిపైనే ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే గదులకు వేలం నిర్వహిస్తాం. బి.గంగయ్య, ఆర్డీవో (కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు)

# అందని సీడీపీ నిధులు.. సాగని పనులు



కరీంనగర్: ఉమ్మడి జిల్లాకు ఈ వార్షిక సంవత్సరం (2024-25)లో రావాల్సిన నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం (సీడీపీ) నిధుల ఊసే లేదు. దీంతో నాలుగు జిల్లాల పరిధిలో గెలిచిన ఎమ్మెల్యేలు.. చేపట్టాల్సిన ప్రగతి పనుల విషయంలో మల్లగుల్లాలు పడుతున్నారు. గతేడాది నవంబరులో జరిగిన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు తోడుగా.. కొత్త పనుల కోసం వెచ్చించాల్సిన నిధులు ఇంకా రాకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పెరుగుతున్నాయి. గ్రామాలు, పట్టణాల నుంచి ఎమ్మెల్యేలకు పలు అభివృద్ధి పనులకు సంబంధించి దండిగా ప్రతిపాదనలు అందుతున్నాయి. ఇటీవల వరదల కారణంగా చాలాచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. వాటికి సంబంధించిన ప్రతిపాదనలకు కూడా ప్రత్యేక ప్యాకేజీ రాకపోవడంతో కళ్లముందు కనిపిస్తున్న పనులకు నిధులను ఏ విధంగా సమకూర్చాలనేది అటు అధికారులకు.. ఇటు నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు సమస్యగా మారింది.

రాష్ట్రం ఏర్పాటయ్యాక రెండింతలు..

కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌డీపీ) నిధి పేరిట ప్రతి శాసనసభ నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున మంజూరు చేసింది. దీనికి అదనంగా సీడీపీ నిధులు కూడా అందితే ఎమ్మెల్యేలకు వచ్చే వినతులకు మోక్షం లభించేది. నియోజకవర్గ అభివృద్ధి నిధి ద్వారా ప్రస్తుతం రూ.5కోట్ల చొప్పున రావాలి. ఉమ్మడి రాష్ట్రంలో ఏటా రూ.50 లక్షలు మాత్రమే ఇచ్చేవారు. తరువాత కొన్నాళ్లకు రూ.75లక్షలు ఆ తరువాత రూ.కోటి యాభై లక్షలకు పెంచారు. తెలంగాణ ఏర్పాటయ్యాక రెండింతలు చేశారు. 2018 నుంచి రూ.5 కోట్లను అందిస్తూ వస్తున్నారు.

అన్నింటికీ ఎస్‌డీపీ నిధులే ఆధారం..

12 నియోజకవర్గాల పరిధిలో కొత్తగా ఈ ఏడాదిలోనే 1500కుపైగా ప్రతిపాదనలు అందినట్లు అధికారులు చెబుతున్నారు. వీటన్నింటికి ఎస్‌డీపీ నిధులే ఆధారమవుతున్నాయి. ప్రతి పనికి ఇన్‌ఛార్జి మంత్రి అనుమతితోనే నిధులు విడుదల చేయాల్సి ఉండటంతో ఇబ్బంది ఏర్పడుతోంది. పూర్తిస్థాయిలో నిధులు రాకపోవడంతో అందిన ప్రతిపాదనలకు ఎమ్మెల్యేలు న్యాయం చేయలేకపోతున్నారు. మరోవైపు కార్యాలయాలకు వచ్చిన ప్రతిపాదనల్లో వేటికి ప్రాధాన్యతనివ్వాలనేది యంత్రాంగానికి తలనొప్పిగా మారుతోంది.

రూ.120 కోట్లపైనే ఆశలు..

గతేడాది నవంబరులో ఎన్నికలు జరగడం డిసెంబరులో కొత్త ప్రభుత్వం ఏర్పాటవడంతో ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి ఈ ప్రత్యేక అభివృద్ధి నిధిని అన్ని నియోజకవర్గాలకు కేటాయించారు. ఇలా 12 నియోజకవర్గాలకు రూ.10కోట్ల చొప్పున వచ్చిన రూ.120 కోట్లను వినియోగించడంపైనే ప్రస్తుతం అందరూ దృష్టి సారిస్తున్నారు. వీటిని పాత పనులకు పెట్టకూడదనే నిబంధనను అమలు చేస్తున్నారు. ఇందులో నుంచి తాగునీటికి రూ.కోటి, బడుల్లో మౌలిక వసతుల కోసం రూ.2 కోట్లు ప్రతి ఎమ్మెల్యే ఖర్చు చేయాలి. అంతేకాకుండా కలెక్టర్, జిల్లా అధికారుల ప్రతిపాదనలతో ప్రభుత్వ భవనాల మరమ్మతులకు రూ.50 లక్షలు విధిగా కేటాయించాలి. మిగిలిన రూ.6.5 కోట్లను ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించాలి.

# నర్సరీలపై.. ఏదీ నజర్?

ఖమ్మం : ఉభయ జిల్లాల్లో మిరప నారు, కూరగాయల మొక్కలను పెంచే నర్సరీలపై నజర్ కొరవడింది. కొందరు నిబంధనలు పాటించటం లేదు. లాభాలే ధ్యేయంగా ఈ ఏడాది నర్సరీలను పెద్దఎత్తున ప్రారంభించారు. కొన్నిచోట్ల కనీసం రశీదులూ ఇవ్వని పరిస్థితి. ఇకనైనా దృష్టిసారించాలని వ్యవసాయశాఖ అధికారులను రైతులు కోరుతున్నారు. ఆళ్లపల్లి మండలానికి చెందిన గొగ్గెల పాపారావు టేకులపల్లిలోని ఓ నర్సరీలో 2 వేల మిరప మొక్కల్ని కొనుగోలు చేశారు. బిల్లు ఇవ్వాలని కోరగా అందుకు నిర్వాహకుడు నిరాకరించాడు. టేకులపల్లి మండలం బద్దుతండాకు చెందిన బాల.. వర్షాలకు ముందు మిరప మొక్కలు నాటారు. వర్షాలతో చాలా మొక్కలు చనిపోవడంతో ఇటీవల మరో 2వేల మొక్కలు కొనేందుకు టేకులపల్లిలోని ఓ నర్సరీని సంప్రదించాడు. కనీసం అది ఏరకమో కూడా చెప్పలేదని రైతు వాపోయారు. ఇల్లెందు మండలం మాణిక్యారానికి చెందిన రైతు రమేశ్.. ఇల్లెందు మండలంలోని ఓ నర్సరీలో మొక్కలు కొన్నారు. బ్రాండ్ పేరైతే చెప్పారని, రశీదు అడిగితే ఇచ్చేది లేదన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఖమ్మం జిల్లాలో 247, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 33 నర్సరీలను అనుమతితో నిర్వహిస్తున్నారు. వీటిల్లో ఇటీవల ఎక్కువగా మిరప నారు పెంచారు. వర్షాల నేపథ్యంలో కొన్నిచోట్ల తోటలు దెబ్బతినడం, కొందరు రైతులు మళ్లీ నాటుతుండటంతో ప్రస్తుతం మిరప మొక్కలకు గిరాకీ బాగా పెరిగింది. ఈ క్రమంలో పంట దిగుబడులను దృష్టిలో పెట్టుకొని రైతులు విత్తనాల వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, నిర్వాహకుల నుంచి నిర్లక్ష్య సమాధానమే ఎదురవుతోంది. 'అది ఏ రకం విత్తనం? కంపెనీ పేరేమిటి? లాట్ నంబరు ఎంత? ఆ వివరాలతో బిల్లు కావాలి' అని అడిగితే పెదవి విరుస్తున్నారు. బిల్లు ఇచ్చేది లేదని, ఇష్టం లేకుంటే వెళ్లిపోవాలని తేల్చిచెబుతున్నారు. దాదాపు చాలాచోట్ల ఇదే పరిస్థితి



ఎదురవుతుండటంతో చేసేదేమీ లేక నారు కొనుగోలు చేస్తున్నారు.

నిబంధనలు ఇవీ..

విత్తన కంపెనీ, లాట్, బ్యాచ్ నంబరు, తయారీ తేదీ, గడువు తేదీ తప్పనిసరిగా నారు పెంచే బెడ్ల ముందు రాసిపెట్టాలి.

నారు విక్రయించిన తేదీ, పూర్తి వివరాలను రికార్డుల్లో పొందుపరచాలి.

నర్సరీలో లభించే నార్లు, ఆయా రకాల మొక్కల సంఖ్య, ధరల వివరాల తెలుగు పట్టికను ప్రధాన ద్వారం వద్ద ప్రదర్శించాలి.

పేరున్న, నాణ్యమైన కంపెనీల విత్తనాలతోనే నారు పెంచి విక్రయించాలి. స్టాక్ రిజిస్టర్‌ను ఇన్‌వాయిస్‌లు సహా సమగ్రంగా నిర్వహించాలి.

ప్రతి నర్సరీకి రెండు ద్వారాలు ఏర్పాటు చేయాలి. కానీ ఈ నిబంధనలు ఎక్కడా పూర్తిగా అమలుకావటం లేదు.

"నర్సరీలో నారు కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ రశీదు ఇవ్వాల్సిందే. నాణ్యమైన విత్తనాలనే వాడాలి. రైతులకు నాసిరకం మొక్కలను అంటగట్టి చేతులు దులిపేసుకుంటే ఊరుకునేది లేదు. ఉల్లంఘనులపై చట్టపరమైన చర్యలు తప్పవు. బాధిత రైతులు ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం."

ఎంవీ మధుసూదన్, జిల్లా ఉద్యానాధికారి, ఖమ్మం

# చిట్టి ఉపాయంతో చిట్టడవులు

టేకులపల్లి : సింగరేణి యాజమాన్యం బొగ్గు వెలికితీతతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తోంది. ఉపరితల గనుల ఏర్పాటు కోసం సింగరేణి యాజమాన్యం రెవెన్యూ, ప్రభుత్వ, అటవీభూములను సేకరిస్తుంటుంది. సేకరించిన భూమికి నష్టపరిహారం, నిర్వాసితులకు పునరావాసం, అటవీశాఖ కోల్పోయిన భూమికి మరో దగ్గర భూమిని కేటాయించటం ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియ. తమ ఆధీనంలోని భూముల్లో ఓబీ డంప్‌లపై మొక్కలు పెంచి వాటిని అభివృద్ధి చేసి బొగ్గు నిల్వలు పూర్తయిన తర్వాత అవే భూములను మళ్లీ అటవీశాఖకు కేటాయించాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఇల్లెందు, కొత్తగూడెం ఏరియాల్లో ఓబీ డంప్‌లపై పెంచిన ప్లాంటేషన్లను భవిష్యత్తు అవసరాల దృష్ట్యా తిరిగి అటవీశాఖకు ఒప్పందాల మేరకు ఇవ్వనుంది.

చేపట్టింది ఇలా..ఉపరితల గనుల కోసం సేకరించిన భూముల్లో బొగ్గును వెలికితీస్తుండగానే మట్టితీత పనులు జరిగాయి. వచ్చిన ఓబీ మట్టిని పెద్దపెద్ద గుట్టలుగా నిర్మించారు. ఈ గుట్టలపై సింగరేణి యాజమాన్యం ఒక హెక్టార్‌కు 2,500 చొప్పున మొక్కలు నాటింది. 80శాతం వరకు మొక్కలు నాటుకుంటాయని అధికారులు చెబుతున్నారు. మారేడు, ఉసిరినారవేప, ఎగిస, బండారు, వెలగ, వెదురు తదితర అడవిజాతి మొక్కలను ఓబీ డంప్‌లపై పెంచుతున్నారు.



హెక్టార్‌కు రూ.40-50వేల వరకు ఖర్చు చేశారు. మొక్కలు నాటిన తరువాత సుమారు రెండేళ్ల వరకు పర్యవేక్షిస్తారు. ఆ తర్వాత వర్షాధారితంతో మొక్కలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం కొన్నిచోట్ల చిట్టడవులను తలపిస్తున్నాయి.

భూముల కొరతను అధిగమించేందుకే..

నూతన గనుల ఏర్పాటులో ఎక్కడైతే ఫారెస్ట్ బ్లాక్ కోల్పోతుందో.. అటవీశాఖ పరిధిలోని భూమిని సింగరేణికి కేటాయిస్తున్నారో దానికి సరిపడా భూమి, అడవిని మరోచోట సింగరేణి యాజమాన్యం అటవీశాఖకు అప్పగించాలి. గతంలో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో సింగరేణి యాజమాన్యం రెవెన్యూ భూములను కొని అటవీశాఖకు కేటాయించేది. ప్రస్తుతం రెవెన్యూ భూములు దొరకటం కష్టతరంగా మారింది. ఈ సమస్యను అధిగమించటానికి సింగరేణి ఇలాంటి ఆలోచనలకు శ్రీకారం చుట్టింది.

ఏ ఏరియాల్లో ఎంతెంత అటవీశాఖకు ఇస్తున్నారంటే..

ఇల్లెందు ఏరియా..(హెక్టార్లలో)

కేఓసీ – 130

జేకేఓసీ – 151

కొత్తగూడెం జీకేఓసీ – 25 గనుల ఏర్పాటుకు అటవీశాఖ భూములను సింగరేణి యాజమాన్యం తీసుకున్నట్లయితే అటవీశాఖకు మరోచోట భూములు చూపించాల్సి ఉంటుంది. భూసేకరణ కష్టతరంగా మారింది. సమస్యను అధిగమించడానికి గతంలో సింగరేణి యాజమాన్యం ఆధీనంలోని ఓబీ డంప్‌లపై అడవిని పెంచి తిరిగి ఫారెస్ట్‌కు అప్పగిస్తున్నాం. తద్వారా నూతన మైన్ల ఏర్పాటుకు అటవీశాఖ అనుమతులు త్వరితగతిన లభిస్తాయి.

హరినారాయణ, ఫారెస్ట్ డీజీఎం, కొత్తగూడెం

# గింజను బట్టే.. అధనం

ఆలేరు : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్నరకం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. యాదాద్రి జిల్లాలో పత్తి తర్వాత అధికంగా బావులు, బోర్లు, కుంటలు, చెరువులు, కాలువల ద్వారా ప్రస్తుత సీజన్‌లో మొత్తం 2,59,543 ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో సన్నరకం 31,984 ఎకరాల్లో సాగుచేశారు. సన్న ధాన్యం 70,364 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. దసరా తర్వాత కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ సన్నరకం ధాన్యం కొనుగోళ్ల విషయమై కొత్త నిబంధనలు అమలులోకి తీసుకు రానుండటంతో రైతుల్లో ఒకింత ఆందోళన వ్యక్తమవుతోంది.

కాలిపర్స్‌తో కొలుస్తారట..చిన్నచిన్న వస్తువుల పొడవు, వెడల్పులను లెక్కించడం కోసం కాలిపర్స్ పరికరాన్ని ఉపయోగిస్తారు. సన్న ధాన్యాన్ని గుర్తించేందుకూ దీన్ని వినియోగించనున్నట్లు సమాచారం. ఇందుకు అవసరమైన కాలిపర్స్‌లను కొనుగోలు చేయడానికి పౌరసరఫరాల శాఖ కొనుగోళ్లకు ఉపక్రమించింది. ప్రతి సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రెండు కాలిపర్స్‌లను అందుబాటులో ఉంచాలని నిర్ణయించినట్లు సమాచారం.

ధాన్యంలో పది గింజలను సేకరిస్తారు.. ఒక ప్రత్యేక పరికరంపై వేసి గింజ పొట్టు పోయేలా చేస్తారు. తర్వాత వచ్చిన బియ్యం గింజను కాలిపర్స్ సాయంతో కొలత వేస్తారు. ఈ కొలతలో బియ్యం గింజ 6 మి. మీ కన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు 1 మి. మీకి మించి ఉండరాదు. బియ్యం గింజ పొడవు, వెడల్పుల నిష్పత్తి 2.5మీ.మీ కన్నా ఎక్కువగా ఉండాలి. కాలిపర్స్‌లో పెట్టిన బియ్యం గింజ



ఈ కొలతలకు సరిపోతేనే దానిని సన్న ధాన్యంగా పరిగణిస్తారు. అలాంటి వాటికే బోనస్ ఇస్తారు.

అన్నదాతల్లో ఒకింత ఆందోళన..

సన్న ధాన్యం గుర్తింపు విషయమై ప్రభుత్వం స్పష్టత నిచ్చింది. బీపీటీ-5202తోపాటు ఆర్‌ఎన్‌ఆర్, జైశ్రీరాం, హెచ్‌ఎంటీ సోనా, మరో 33 రకాలను సన్న ధాన్యంగా పరిగణించాలని నిర్ణయించింది. మొత్తం ఈ 37 రకాల్లో యాదాద్రి జిల్లాలో ఏడు, ఎనిమిది రకాలు మాత్రమే సాగవుతాయి. వ్యవసాయశాఖ సన్నరకాలుగా ప్రకటించిన జాబితాలో రైతు పండించిన ధాన్యం ఉన్నా.. కొలతల్లో తేడా వస్తే మాత్రం దొడ్డు రకంగా పరిగణిస్తారు. ఈ క్రమంలో రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది. క్షేత్రంలో భూసారాన్ని బట్టి గింజ పరిమాణంలో తేడా ఉంటుందని, ధాన్యం గుర్తింపులో ఈ కొలతలు ఎందుకని రైతులు అంటున్నారు. కొలతల పేరిట కొర్రీలు పెట్టి బోనస్‌ను ఎగ్గొట్టేందుకే కొత్త నిబంధనలు అమలులోకి తీసుకువస్తున్నారని అన్నదాతలు విమర్శిస్తున్నారు. 'కాగా సన్నరకం ధాన్యం కొనుగోళ్ల విషయమై ఇంకా మార్గదర్శకాలు రాలేదని, ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు ఉన్న ధాన్యాన్ని మాత్రమే సన్నరకంగా పరిగణిస్తామని' పౌరసరఫరాల శాఖ, వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.




## త్వరలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్: సీఎం చంద్రబాబు

అమరావతి: త్వరలోనే కర్నూలులో ఏపీ హైకోర్టు బెంచ్ ఏర్పాటవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. లోకాయుక్త, ఏపీ హెచ్ఆర్సీ తదితర సంస్థలు కూడా అక్కడే ఉంటాయని వెల్లడించారు. కర్నూలు(%ఖబతీఅశీశ్రీ చీవఎం%)లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం మాట్లాడారు. "రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు కూడా అభివృద్ధి కావాలి. గత ప్రభుత్వం మూడు రాజధానులని మూడు ముక్కలాట ఆడింది. ఎన్నికల ముందు కర్నూలు, విశాఖపట్నంలోనూ రాజధాని అమరావతి అని చెప్పిన ఘనత కూటమిది. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి తెదేపాతోనే సాధ్యం. గతంలో చేశాం.. ఇప్పుడు చేసి చూపిస్తున్నాం. తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి లాంటి ప్రాజెక్టులను తెదేపా ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పుడు ఆ ప్రాజెక్టులను పూర్తిచేసేది ఎన్డీయే ప్రభుత్వమే. కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకెళ్లాం.

నదుల అనుసంధానంతో రాయలసీమకు తాగు, సాగునీటి సమస్య లేకుండా చేస్తాం. కొప్పర్తి, ఓర్వకల్లు క్లస్టర్ల కోసం రూ.5వేల కోట్లు కేటాయించాం" అని చంద్రబాబు వివరించారు.

## విశాఖలో 7 రెట్లు పెరిగిన వాయు కాలుష్యం: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



అమరావతి: విశాఖ తీరంలో వాయు కాలుష్య స్థాయి 7 రెట్లు పెరిగిందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. విశాఖ తీరంలో వాయు కాలుష్యంపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమాధానమిచ్చారు. వాయు కాలుష్యం జరగకుండా పరిస్థితి మెరుగుకు చర్యలు చేపట్టామన్నారు. పారిశ్రామిక వృద్ధికి ప్రోత్సాహమందిస్తున్నట్లు చెప్పారు. విశాఖలో భారీ పెట్టుబడుల ఆకర్షణపై ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు. "పర్యావరణ క్షీణత, కాలుష్య ప్రభావం తగ్గించేందుకు చర్యలు చేపట్టాం. దీనిపై పీసీబీ అధ్యయనం చేస్తోంది. 2025 జనవరిలో ఈ నివేదిక వస్తుంది. అది రాగానే విశాఖలో తగిన కార్యాచరణ చేపడతాం. గ్రీన్ ఎనర్జీని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కంప్రెస్డ్ బయోగ్యాస్ వినియోగంతో కాలుష్యం తగ్గిస్తాం. థర్మల్ పవర్ ప్రాజెక్టుల ఫ్లైయాష్ కూడా పొల్యూషన్‌కు కారణం. సిమెంట్ తయారీకి ఫ్లైయాష్ వాడి దీన్ని కట్టడి చేస్తాం. విశాఖ, గుంటూరులో ఘన వ్యర్థాలతో విద్యుత్ తయారీ చేపడుతున్నాం. దీన్ని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తాం. ఎన్జీవోల భాగస్వామ్యంతో కాలుష్య నివారణకు చర్యలు చేపడతాం. డిసెంబర్‌లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తాం. విశాఖలో కాలుష్య నివారణ చర్యలపై సమీక్షించి తగు చర్యలు తీసుకుంటాం" అని పవన్ కళ్యాణ్ చెప్పారు.

**విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు: పవన్...** విశాఖ స్టీల్‌ప్లాంట్ అంశంపై అసెంబ్లీలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడారు. ప్రైవేటీకరణ చేయబోమని స్పష్టంగా చెబుతున్నామన్నారు. ప్రైవేటీకరణ వద్దని కేంద్రమంత్రిని కలిసి కోరినట్లు చెప్పారు. గతంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రైవేటీకరిస్తామంటే తామే ఆపామని పేర్కొన్నారు.

## ఐటీలో 5 లక్షల ఉద్యోగాలే మా లక్ష్యం: లోకేశ

అమరావతి: మూడు నెలల్లో విశాఖకు టీసీఎస్ వస్తుందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. "ఐదు సంవత్సరాల్లో 5 లక్షల ఐటీ ఉద్యోగాలే మా లక్ష్యం. తెదేపా హయాంలో 2014 నుంచి 2019 మధ్యలో సుమారు 150 కంపెనీలు 50 వేల మందికి ఉద్యోగాలు కల్పించాయి. ఈ పరిశ్రమలను ఆనాడు చొరవతో తీసుకొచ్చాం. అనేక సదస్సులు ఏర్పాటుచేసి విశాఖపై దృష్టిసారించాం. ముందుచూపుతో ఆనాడు డేటా సెంటర్ పాలసీ తీసుకొచ్చి అదానీ సంస్థతో ఒప్పందం చేసుకున్నాం. భూములు కేటాయించి శంకుస్థాపనలు చేశాం.. కానీ అది ఆగిపోయింది. 2019-24 మధ్య ఒక్క కాంక్లేవ్ జరగలేదు.. ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. బాధాకరమైన పరిస్థితి ఏంటంటే.. గతంలో హైదరాబాద్‌లో రేస్ జరిగింది. దీన్ని ఏపీలో ఎప్పుడు నిర్వహిస్తారని అడిగిన ప్రశ్నకు అప్పటి మంత్రి.. కోడి.. గుడ్డు పెట్టలేదని సమాధానమిచ్చారు. ఆరోజు నుంచి ఎక్కడికెళ్లినా ఐటీ మంత్రి ఇలా ఉంటారా అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అవమానం జరిగింది. ఇలా అయితే పరిశ్రమలు ఎలా వస్తాయన్నారు. నేను మంత్రిగా బాధ్యతలు చేపట్టాక పలు కంపెనీలను కలిస్తే గత ప్రభుత్వంలో



వాళ్లు వాటాలడిగారని చెప్పారు. దీంతో పరిశ్రమలు వెళ్లిపోయాయి. ఐటీ కంపెనీల్లో కూడా వాటాలడిగే పరిస్థితి తెచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మేం ఐటీ సంస్థల వాళ్లందరితో సమావేశమయ్యాం. సమస్యలు తెలుసుకున్నాం. సీఎం చంద్రబాబు చొరవ వల్ల ప్రపంచంలో ఎక్కడికెళ్లినా ఐటీ రంగంలో 20 శాతం మంది తెలుగువాళ్లు ఉండటం గర్వకారణం" అని నారా లోకేశ్ చెప్పారు.

## వైద్య విద్య చదవాలనుకునే పేదల కలను వైకాపా ప్రభుత్వం ఛిద్రం చేసింది: మంత్రి సత్యకుమార్

అమరావతి: రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన మెడికల్ కళాశాలల నిర్మాణంపై వైకాపా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. మండలిలో వైకాపా సభ్యుల ప్రశ్నలకు ఆయన దీటుగా సమాధానం చెప్పారు. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో షెడ్లు వేసి పాఠాలు చెప్పాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. మెడికల్ కళాశాలల్లో బోధనా సిబ్బంది నియామకానికి గత ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన రూ.198 కోట్ల నిధులనూ గత ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. వైద్య కళాశాలల నిర్మాణానికి రూ.8400 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా.. రూ.1400 కోట్లు ఖర్చు పెట్టారని చెప్పారు. మెడికల్ కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ స్కీమ్‌ను తెచ్చిందే వైకాపా ప్రభుత్వమని విమర్శించారు. స్కీమ్ తెచ్చిన వారే ఈరోజు ప్రశ్నిస్తున్నారని వైకాపా



సభ్యులపై మండిపడ్డారు. వైద్య విద్య చదవాలనుకునే పేద పిల్లల కలను వైకాపా ప్రభుత్వం ఛిద్రం చేసిందన్నారు.

## విజయసాయిరెడ్డిపై హైకోర్టులో పిటిషన్.. విచారణ వాయిదా




హైదరాబాద్/అమరావతి, నవంబర్ 21: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో A2 నిందితుడు ఎంపీ విజయ్ సాయి రెడ్డిపై వేసిన పిటిషన్‌పై ఈరోజు (గురువారం) తెలంగాణ హైకోర్టులో విచారణకు వచ్చింది. ఇనిస్ట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్ ఆఫ్ ఇండియా ఈ పిటిషన్ దాఖలు చేసింది. వ్యక్తిగత దుష్ప్రవర్తనపై విజయ్ సాయి రెడ్డిని విచారించాలని ఇప్పటికే ఐసీఏఐ నోటీసులు ఇచ్చింది. ఎంపీ విజయ్ సాయి రెడ్డికి ఇచ్చిన నోటీసులు రద్దు చేస్తూ గతంలో సింగిల్ బెంచ్ ఆదేశాలు ఇచ్చింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను డివిజన్ బెంచ్‌లో ఐసీఏఐ సవాల్ చేసింది. వృత్తిపరమైన ప్రవర్తన నియమావలని ఉల్లఘించారని విచారణకు అనుమతి ఇవ్వాలని ఐసీఏఐ పేర్కొంది. కేసు పూర్వాపరాలు పరిశీలించకుండా నోటీసులు రద్దు చేయడం సరైంది కాదని ఐసీఏఐ పేర్కొంది. ఒకే అంశంలో రెండు వేరు వేరు వ్యక్తుల పిటిషన్‌లను కలిపి లిస్ట్ చేయడంపై ఐసీఏఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. విజయ్ సాయి రెడ్డిపై వేసిన పిటిషన్‌ను వేరుగా విచారణ చేయాలని కోర్టును ఐసీఏఐ కోరింది. దీనిపై విచారణ జరిపిని హైకోర్టు.. మరో పిటిషన్‌తో జత చేకుండా విజయ్ సాయి రెడ్డిపై వేసిన పిటిషన్‌ను విడిగా లిస్ట్ చేయాలని రిజిస్ట్రీకి చీఫ్ జస్టిస్ బెంచ్ ఆదేశించింది. తరుపరి విచారణ వచ్చే వారానికి హైకోర్టు ధర్మాసనం వాయిదా వేసింది.

## తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల విడుదల

తిరుమల: శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల ఫిబ్రవరి నెల కోటాను విడుదల చేశారు. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ 2025 ఫిబ్రవరి నెల కోటాను గురువారం తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన ఫిబ్రవరి నెల కోటాను గురువారం మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అంగ ప్రదక్షిణం టోకెన్ల కోటాను నవంబరు 23న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. శ్రీవాణి ట్రస్టు టికెట్లను నవంబర్ 23 ఉదయం 11 గంటలకు తితిదే విడుదల చేయనుంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఫిబ్రవరి నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను నవంబరు 23న మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను నవంబరు 25న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతిలో ఫిబ్రవరి నెల గదుల కోటాను నవంబరు 25న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసకోవచ్చు.




**వరి రైతులు 73373 59375 నెంబర్ కు 'హాయ్' అని వాట్సప్ చేస్తే చాలు ధాన్యం కొనుగోలు చేస్తామని ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఈ నెంబర్‌ను అనుసంధానించి.. రైతులకు సేవలు అందించేలా ఏర్పాట్లు చేసింది. 'ఈ క్రాప్'లో నమోదు చేసుకున్న రైతులంతా ఈ విధానంలో పంట అమ్ముకునే వీలు కల్పించింది**




## నేనేంటో చూశావ్.. నోరు అదుపులో పెట్టుకో.. జగన్‌కు ఏబీవీ హెచ్చరిక

అమరావతి, నవంబర్ 21: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై రిటైర్డ్ డీజీ ఏబీ వెంకటేశ్వర్‌రావు సీరియస్ అయ్యారు. నిన్న(బుధవారం) ప్రెస్‌మీట్‌లో జగన్ చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా ఏబీ వెంకటేశ్వరరావు స్పందిస్తూ జగన్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. "మిస్టర్ జగన్ రెడ్డి...నోరు అదుపులో పెట్టుకో... మాట సరి చేసుకో... భాష సరి చూసుకో. ఒకసారి ప్రజల విశ్వాసం కోల్పోయినా... ఒకసారి నోరు జారినా... వాటిని తిరిగి ఎన్నటికీ పొందలేరు. నీ లా కుసంస్కారంతో నేను మాట్లాడను.. తెర వెనుక బాగోతాలు నడుపను. నేనేంటో.. నా తలవంచని నైజం ఏమిటో గడచిన ఐదు ఏళ్లలో నువ్వే చూశావ్... బి కేర్ ఫుల్" అని ఏబీవీ హెచ్చరించారు. "ఫర్ ది రికార్డ్ అంటూ నిన్న నువ్వు నా గురించి చెప్పింది పచ్చి అబద్ధం" అంటూ ఏబీ వెంకటేశ్వరరావు ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా.. నిన్న మీడియా సమావేశంలో మాట్లాడిన జగన్.. ఏబీ వెంకటేశ్వరరావును ఉద్దేశించి పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్టులపై మాట్లాడిన ఆయన.. దీని వెనక ముగ్గురు రిటైర్డ్ ఐపీఎస్‌లు ఉన్నారని ఆరోపించారు. వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్టుల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్షకపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వారిని అరెస్టు చేసేలా పోలీస్ శాఖను ప్రయోగిస్తున్నారని విమర్శించారు. అలాగే అరెస్టులపై చంద్రబాబుకు ముగ్గురు రిటైర్డ్ ఐపీఎస్ అధికారులు సలహాలు ఇస్తున్నారన్నారు. వారు నిరంతరం సచివాలయంలో తిష్ట వేసి ఉంటున్నారని వ్యాఖ్యలు చేశారు. అలాగే ఏబీ వెంకటేశ్వరరావు, ఆర్పీ ఠాకూర్, యోగానంద్ పేర్లను ఉచ్చరించడమే కాకుండా.. వారికి ఏమాత్రం మార్యాద ఇవ్వకుండా ఏక వచనంతో సంభోదించారు జగన్. ఈ ముగ్గురు రిటైర్డ్ అధికారులు అన్ని జిల్లాలలో వైసీపీ నేతల చిట్టాను ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా తెప్పించుకుని పక్కా ప్రణాళికతో అరెస్టుల పర్వం సాగిస్తున్నట్లు జగన్ ఆరోపించారు. ముగ్గురు రిటైర్డ్ ఐపీఎస్‌ల గురించి జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి.

అయితే జగన్ వ్యాఖ్యలపై ఏబీ వెంకటేశ్వరరావు కూడా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కాగా.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు పట్ల సర్కార్ ప్రవర్తించిన తీరు అందరికీ తెలిసిందే. తన ఉద్యోగం కోసం న్యాయస్థానాలకు వెళ్లి మరీ పోరాటం చేశారు ఏబీ వీ. గత ప్రభుత్వంపై ఏబీ వెంకటేశ్వరరావు ఎప్పటికప్పుడు ధిక్కరాస్వరం వినిపిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందంటూ ఆరోపణలు కూడా చేశారు. చివరకు ఉద్యోగం కోసం న్యాయస్థానంలో చివరి వరకు పోరాడి గెలిచారు. రిటైర్మెంట్ రోజే ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఏబీ వెంకటేశ్వరరావు.. అదే రోజు సాయంత్రం పదవీ విరమణ పొందారు. అప్పట్లో ఈ వార్త సంచలనంగా మారింది.

## గంజాయి సాగు చేసినా.. తరలించినా పీడీ యాక్ట్: హోంమంత్రి అనిత

అమరావతి: వైకాపా ప్రభుత్వం గంజాయి, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని హోంమంత్రి అనిత విమర్శించారు. ఐదేళ్లలో జగన్ ఒక్కసారి కూడా సమీక్ష చేయలేదని.. దీంతో దుండగులు రెచ్చిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంజాయితో పాటు బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు, వాటి కట్టడికి తీసుకుంటున్న చర్యలపై శాసనసభలో పలువురు సభ్యులు ప్రశ్నలు వేశారు. వీటికి హోంమంత్రి సమాధానమిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గంజాయి కట్టడికి చర్యలు చేపట్టామని అనిత తెలిపారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, సబ్ కమిటీ ఏర్పాటు చేశామని.. దీంతో నేరస్థులను అణచివేస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబు ఇప్పటికే ఏడు సార్లు సమీక్ష నిర్వహించారని వివరించారు. గత ఐదు నెలల్లో 25 వేల కిలోల గంజాయి పట్టుకున్నట్లు తెలిపారు. దీన్ని సాగు చేసినా.. తరలించినా పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఆస్తులు సైతం జప్తు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**గంజాయి నియంత్రణపై సీఎం ప్రత్యేక దృష్టి: మంత్రి నారా లోకేశ్...** అనంతరం మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. గంజాయి కట్టడిపై ప్రత్యేక చర్చ నిర్వహించాలని స్పీకర్‌ను కోరారు. ఈ సమావేశాలు లేదా వచ్చే సమావేశాల్లోనైనా చర్చ నిర్వహించాలని ప్రతిపాదించారు.



కూటమి ప్రభుత్వంలో గంజాయి నియంత్రణకు మంత్రివర్గ ఉపసంఘం నియమించినట్లు చెప్పారు. దీనిపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి పెట్టారని వివరించారు.

## అప్పుల భారం.. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి ఆత్మహత్య

నార్పల: అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం... కృష్ణ కిషోర్ (45), భార్య శిరీష (35) తమ ఐదు నెలల చిన్నారితో కలిసి పోలీస్‌స్టేషన్ సమీపంలోని సంతబజారులో నివాసం ఉంటున్నారు. ఐదు రోజుల నుంచి వారెవరూ బయటకు రాలేదు.

ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో అనుమానం వచ్చిన కొందరు పక్క ఇంటి మిద్దెపై నుంచి ఇంట్లోకి చూశారు. తీవ్రమైన దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సాగర్, ఆర్ఐ జ్యోతి, ఏఎస్సై నాగరాజు తదితరులు అక్కడికి చేరుకొని తలుపులు బద్దలుకొట్టి చూడగా.. భార్యాభర్తలిద్దరూ ఉరివేసుకొని ఉన్నారు. ఉయ్యాలలో చిన్నారి విగతజీవిగా పడి ఉన్నాడు. ఆర్థిక సమస్యల వల్లే ఉత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు



భావిస్తున్నారు. కిషోర్ మెడికల్ స్టోర్ నిర్వహించేవాడని ఈ క్రమంలో అప్పులు ఎక్కువయ్యాని అంటున్నారు. ఆత్మహత్య చేసుకొని నాలుగైదు రోజులు కావడంతో మృతదేహాలు కుళ్లిపోయే దశకు చేరుకున్నాయి. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రసక్తే లేదు: వైకాపా ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రులు




అమరావతి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై శాసన మండలిలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తున్నారంటూ వైకాపా సభ్యులు ఆరోపించగా.. వాటిని మంత్రులు దీటుగా తిప్పికొట్టారు. ప్రైవేటీకరణ ప్రసక్తే లేదని డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు అచ్చెన్నాయుడు, టీజీ భరత్ తేల్చిచెప్పారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి సైతం ప్రైవేటీకరణ చేయడం లేదని స్పష్టంగా చెప్పారని భరత్ గుర్తుచేశారు. ఇంతకంటే క్లారిటీ ఏం కావాలని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ వద్దని కేంద్రహోంమంత్రి అమిత్‌షాను కలిసి కోరినట్లు పవన్ వివరించారు. గతంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను ప్రైవేటీకరిస్తామంటే తామే ఆపామని ఆయన గుర్తుచేశారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో ప్రైవేటీకరణపై ముందడుగు పడిందని అధికార పార్టీ సభ్యులు ధ్వజమెత్తారు. దీనిపై ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం తెలిపారు. ప్రైవేటీకరణ వద్దంటూ సభలో ఏకగ్రీవ తీర్మానం చేయాలని సూచించారు. ఆ తర్వాత మాట్లాడిన అచ్చెన్న.. ప్రైవేటీకరణ అంశమే ఉత్పన్నం కానప్పుడు తీర్మానం ఎందుకని ప్రశ్నించారు.

# ముచ్చటగా మూడు లాక్ చేసిందిలా!

'మిస్టర్ బచ్చన్' తో టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన భాగ్యశ్రీ భోర్సే సుపరిచితమే. అమ్మడికి తొలి సినిమా ఫ్లాప్ ఇచ్చినా? నటన పరంగా పాస్ అయిపోయింది. వచ్చిన అవకాశంతో ట్యాలెంటెడ్ బ్యూటీనని నిరూపించుకుంది. సోగసరి నటనలో ఈజ్ ఉంది. హీరోయిన్ పక్కన హీరోయిన్ అనే లెక్కలో కాకుండా వినూత్నమైన నటనతో రీచ్ అయింది. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ , రానా నటిస్తోన్న 'కాంత'లో హీరోయిన్ గా నటిస్తోంది. ఇది భాగ్యశ్రీకి రెండవ సినిమా. తాజాగా మూడవ సినిమా కూడా ఖాతాలో వేసుకుంది. ఎనర్జిటిక్




స్టార్ రామ్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ ఓ సినిమా నిర్మిస్తుంది. ఇది రామ్ కి 22వ సినిమా. ఇందులో ఆయనకు జోడీగా భాగ్యశ్రీని ఎంపిక చేసారు. ఎనర్జిటిక్ స్టార్ కి జోడీగా తీసుకున్నారంటే? ఆయన నటన మ్యాచ్ చేయాలి. అందులో భాగ్య శ్రీ ఎక్కడా తగ్గే నటి కాదు. రామ్ కి పోటీగా నటించగల సమర్ధురాలే. 'మిస్టర్ బచ్చన్' లో రవితేజకి జోడీగా పోటీగా నటించింది. అమ్మడు ఎక్కడా డెబ్యూ అనే ఫీల్ తీసుకురాకుండా చేయడంతో మంచి సక్సస్ అయింది. మహేష్ బాబు.పి దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమా మరికొన్ని గంటల్లో అధికారికంగా ప్రారంభం కానుంది.

లైనప్ లో ఉన్న సినిమాలు గనుక సక్సెస్ అయితే భాగ్య శ్రీ ట్యాలెంట్ కి తక్కువ సమయంలోనే స్టార్ లీగ్ లో చేరడానికి అవకాశం ఉంది. అమ్మడు టాలీవుడ్ కంటే ముందే బాలీవుడ్లో లాంచ్ అయింది. అక్కడ 'యారియాన్-2'లో నటించింది. ఇటీవల రిలీజ్ అయిన 'చందు ఛాంపియన్' తోనూ అలరించింది. కానీ అక్కడ ఆశించిన విధంగా ఛాన్సులు రాలేదు. ఈ క్రమంలోనే టాలీవుడ్ లో అడుగు పెట్టింది. అయితే అమ్మడి కెరీర్ ప్రారంభమై ఏడాది మాత్రమే గడిచింది. మును ముందు మంచి భవిష్యత్ ఉంది. భాగ్య శ్రీది ఔరంగాబాద్. మోడలింగ్ నుంచి సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది.

## నేషనల్ క్రష్ ని చూసి కుళ్ళుకుంటున్న భామలు..!

అవకాశాలు అందరికీ వస్తాయి కానీ వాటిని సక్సెస్ చేసుకోవడంలోనే కథానాయికల ప్రతిభ ఉంటుంది. అలా చేస్తున్న సినిమాలతో హిట్లు సూపర్ హిట్లు కొడుతూ నేషనల్ క్రష్ గా మారింది రష్మిక మందన్న. అమ్మడు ఏదైనా సినిమా చేస్తుంది అంటే ఆ సినిమా కచ్చితంగా వర్క్ అవుట్ అయినట్టే లెక్క. సౌత్ లో స్టార్ క్రేజ్ తెచ్చుకున్న రష్మిక బాలీవుడ్ కి వెళ్లి మొదటి రెండు సినిమాలు నిరాశ పరిచినా యానిమల్ తో అమ్మడికి బ్లాక్ బస్టర్ హిట్ దక్కింది. ఆ సినిమా ఇచ్చిన జోష్ తో బాలీవుడ్ లో కూడా వరుస సినిమాలు చేస్తుంది అమ్మడు. యానిమల్ తర్వాత పుష్ప 2 తో అమ్మడు అదరగొట్టబోతుంది. డిసెంబర్ 5న రిలీజ్ కాబోతున్న పుష్ప 2 సినిమాకు నేషనల్ వైడ్ గా ఉన్న క్రేజ్ తెలిసిందే. ఆ సినిమాలో హీరోయిన్ గా రష్మిక మరోసారి టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. పుష్ప 1 లో పుష్ప రాజ్, శ్రీవల్లి



రొమాన్స్ తెలిసిందే. ఐతే పార్ట్ 2 లో వీళ్ల పాత్రలు వారి మధ్య ఎమోషన్ మరింత స్ట్రాంగ్ గా కనిపిస్తున్నారు. పుష్ప 2 ట్రైలర్ లో పుష్ప రాజ్ తర్వాత శ్రీవల్లి పాత్ర హైలెట్ గా నిలిచింది. పుష్ప 2 సూపర్ హిట్ పడితే మళ్లీ రష్మిక పేరు నేషనల్ వైడ్ గా మారుమోగుతుంది. పుష్ప 2 మాత్రమే కాదు అమ్మడి ఖాతాలో క్రేజీ సినిమాల లిస్ట్ చాలానే ఉంది. ధనుష్ తో కుబేర సినిమా చేస్తున్న రష్మిక ది గర్ల్ ఫ్రెండ్ అంటూ ఒక సోలో సినిమా కూడా చేస్తుంది. వీటితో పాటు ఛావా అంటూ బాలీవుడ్ సినిమా సెట్స్ మీద ఉంది. బాలీవుడ్ లో ఛావాతో పాటు సల్మాన్ ఖాన్ సికందర్ సినిమా కూడా చేస్తుంది రష్మిక. అమ్మడి క్రేజ్ ని బాలీవుడ్ స్టార్స్ కూడా గుర్తించి ఆమెతో వరుస సినిమాలు చేస్తున్నారు.ఈ సినిమాన్నిటితో రష్మిక తన స్టార్ ఫాం కొనసాగిస్తుందని చెప్పొచ్చు.

నేషనల్ వైడ్ గా రష్మిక పాపులారిటీ చూసి మిగతా హీరోయిన్స్ అంతా కుళ్లుకుంటున్నారు. పోటీగా ఎంతమంది ఉన్నా పాన్ ఇండియా సినిమాలతో నేషనల్ లెవెల్ లో రష్మిక తన సత్తా చాటుతుంది. రాబోతున్న సినిమాలు కూడా ఇదే రిజల్ట్ అందిస్తే ఆమెను ఆపడం ఎవరి వల్లా కాదని చెప్పొచ్చు. ఎవరు ఎంత కుళ్లుకున్నా తన టాలెంట్ తో రష్మిక వరుస సూపర్ హిట్లు కొడుతుంది.




# పుష్ప 2: అక్కడ ముందు రోజే.. స్పెషల్ ప్రీమియర్ షో!



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ డ్రామా పుష్ప: ది రూల్ పై ప్రపంచవ్యాప్తంగా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. డిసెంబర్ 5న ఈ చిత్రం థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతుండగా, విడుదలకు ముందు ప్రీ రిలీజ్ హైప్ పెంచేందుకు మేకర్స్ ఒక ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశారు. తాజా సమాచారం ప్రకారం, పుష్ప 2 చిత్రం విడుదలకు ముందు రోజు హైదరాబాద్ లోని ప్రముఖ థియేటర్లో ప్రీమియర్ షో వేయాలని మేకర్స్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఓవర్సీస్ లో ముందుగానే ప్రీమియర్స్ పడుతూ ఉంటాయి. ముఖ్యంగా యూఎస్ లో పుష్ప 2 షోలు గట్టిగానే సౌండ్ చేయబోతున్నాయి. ఇక ప్రీమియర్స్ తోనే అక్కడ బన్నీ అక్కడ రికార్డు క్రియేట్ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా 1 మిలియన్ దాలర్స్ దాటాయి. ఇప్పుడే లెక్క ఆ రేంజ్ లో ఉందంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇక హైదరాబాద్‌లో కూడా ప్రత్యేకంగా ఒక షోను విడుదలకు ఒక రోజు ముందే వేసేందుకు సిద్ధమయ్యారు. ప్రముఖ థియేటర్లలో ఒకటైన విమల్ థియేటర్‌ను ప్రీమియర్ షోను వేయనున్నట్లు తెలుస్తోంది. ఎక్కువస్థాయిలో ప్రేక్షకులను ఆకర్షించగల పెద్ద స్క్రీన్ అనుభవాన్ని అందించడంతో పాటు, ఈ థియేటర్‌లోని ఫ్యాన్స్ రిస్పాన్స్ మేకర్స్‌కు మంచి ఫీడ్‌బ్యాక్ ఇస్తుందని భావిస్తున్నారు. అల్లు అర్జున్‌కు హైదరాబాద్‌లో భారీ ఫ్యాన్ బేస్ ఉండడంతో, ఈ ప్రీమియర్ షో సినిమాపై మరింత హైప్‌ను సృష్టించనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రీమియర్ షోలో పాల్గొనడానికి చిత్రబృందంతో పాటు కొందరు ప్రముఖ సెలబ్రిటీలు కూడా హాజరవుతారని సమాచారం. ఈ షో అభిమానులకు పండగ వాతావరణాన్ని కల్పించనుంది. ఈ ప్రీమియర్ షో ద్వారా సినిమాలోని ముఖ్యమైన సన్నివేశాలు మరియు మాస్ ఎలిమెంట్స్ పై ప్రేక్షకుల మొదటి స్పందనను తెలుసుకోవాలని మేకర్స్ ప్లాన్ చేసినట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు విపరీతమైన స్పందన రావడంతో, ప్రీమియర్ షో ద్వారా సినిమా విడుదలకు ముందు మరింత బజ్ క్రియేట్ చేసే అవకాశం ఉంది. ప్రత్యేకంగా, పుష్ప 2 మాస్ ఆడియెన్స్‌కు అనువుగా ఉండడంతో, విపరీతమైన ఆకర్షణ సృష్టించేందుకు ఈ ప్రీమియర్ షో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ఇక ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించగా, రష్మిక మందన్న, ఫహద్ ఫాసిల్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషించారు. భారీ బడ్జెట్‌తో మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన పుష్ప 2 సినిమా నేషనల్ లెవెల్ బ్లాక్‌బస్టర్ గా నిలుస్తుందని అంటున్నారు. మరి ఫస్ట్ టాక్ ఎలాంటి వైబ్ క్రియేట్ చేస్తుందో చూడాలి.

# ప్రచారం కోసం బాలీవుడ్ మెగాస్టార్ ఎత్తుగడ!




అమితాబ్ బచ్చన్- అభిషేక్ బచ్చన్ మధ్య అనుబంధం అన్యోన్యతను ఆవిష్కరించింది ఈ టీవీ షో. ఓవైపు అభిషేక్ బచ్చన్ తన భార్య ఐశ్వర్యారాయ్ నుంచి విడిపోతున్నాడంటూ ప్రచారం సాగుతోంది. కానీ దీనిపై ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఇక అభిషేక్ ప్రస్తుతం తన సినిమాలను ప్రమోట్ చేసుకుంటూ బిజీగా ఉన్నాడు. కౌన్ బనేగా కరోడ్‌పతి సమయంలో అభిషేక్ బచ్చన్ తాను తన తండ్రి అమితాబ్ బచ్చన్ కంటే మెరుగైన డ్రైవర్ ని అని హాస్యాస్పదంగా పేర్కొన్నాడు. అమితాబ్ డ్రైవింగ్ పై దృష్టి పెట్టకుండా ట్రాఫిక్ ఉల్లంఘించే వారి ఫోటోలు తీయడంపై చమత్కరించారు. ప్రస్తుతం, వారు తమ కొత్త చిత్రం ఐ వాంట్ టు టాక్‌ను ప్రమోట్ చేస్తున్నారు,

22 నవంబర్ 2024న ఈ చిత్రం విడుదల అవుతుంది. కేబీసీకి అతిథిగా వచ్చిన ఫిలింమేకర్ షూజిత్ సిర్కార్ బచ్చన్‌లను ఎవరు బెస్ట్ డ్రైవర్ అని అడిగినప్పుడు ఈ సరదా చర్చ సాగింది. ఈ క్లిప్ వేగంగా వైరల్ అయ్యింది.. సోషల్ మీడియాలో అభిమానులను అలరించింది. ఎవరు బాగా డ్రైవ్ చేస్తారని ప్రశ్నించేప్పుడు.. అమితాబ్ ఆత్రంగా తన చేతిని పైకెత్తాడు. అయితే అభిషేక్ వెంటనే పా, దయచేసి! అని అన్నాడు. దీంతో అమితాబ్ సిగ్గుతో తన చేతిని కిందికి దించాడు. అభిషేక్, నువ్వు నాకు డ్రైవింగ్ నేర్పించావు, కానీ నేను చాలా బాగా డ్రైవ్ చేస్తున్నాను అని చమత్కరించాడు. ఈ పరిహాసం ప్రేక్షకులను నవ్వించింది. అమితాబ్ డ్రైవింగ్‌పై దృష్టి పెట్టడం కంటే ఇతర డ్రైవర్‌లను తిట్టడాన్ని ఎక్కువగా ఇష్టపడతారని అభిషేక్ చమత్కరించాడు. ఎవరైనా రాంగ్ రూట్ లో వస్తే, అమితాబ్ వారి ఫోటోను క్లిక్ చేయడానికి తన ఫోన్‌ని తీస్తాడు. అలా ఎందుకు చేస్తున్నావని నేను అడిగితే సిగ్నల్ బ్రేక్ చేసినందుకు ట్రాఫిక్ పోలీసులకు పంపిస్తాను అని అంటాడు. ఇంతలో అవతలి వ్యక్తి వావ్ అమితాబ్ బచ్చన్ నా సెల్ఫీ తీసుకుంటున్నాడు!.. అని ఫీలవుతాడు.. అనగానే అమితాబ్, షూజిత్ సిర్కార్‌తో సహా అందరూ ఫుల్ గా నవ్వుకున్నారు. ప్రస్తుతం అభిషేక్ -షూజిత్ తమ కొత్త ఫ్యామిలీ డ్రామా ఐ వాంట్ టు టాక్‌ని ప్రమోట్ చేస్తున్నారు. సెన్సిటివ్ కంటెంట్ తో అద్భుత చిత్రాలు తెరకెక్కించే షూజిత్‌తో అభిషేక్ చేస్తున్న మొదటి ప్రాజెక్ట్. అమితాబ్ బచ్చన్ నటించిన గులాబో సీతాబోకి షూజిత్ దర్శకత్వం వహించాడు.

# బ్లాక్ షర్ట్‌లో క్యూట్ దివి

తెలుగు బిగ్ బాస్‌తో ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ దివి. అంతకు ముందు పలు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేసిన దివికి పెద్దగా గుర్తింపు రాలేదు. కానీ బిగ్ బాస్‌లో కొన్ని వారాలు ఉన్నా మంచి గుర్తింపు లభించింది. సోషల్ మీడియాలో ఈమె బిగ్‌బాస్ వల్ల మంచి పాపులారిటీ సొంతం చేసుకుంది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం. హీరోయిన్‌గా పలు సినిమాల్లో నటించిన ఈ అమ్మడు ఈ మధ్య కాలంలో వెబ్ సిరీస్‌ల్లోనూ నటిస్తూ బిజీగా ఉంది. ఎంత బిజీగా ఉన్న సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసి వార్తల్లో నిలుస్తూ ఉంది. బిగ్ బాస్ తో వచ్చిన పాపులారిటీతో దివి సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. అంతే కాకుండా సోషల్ మీడియాలోనూ హీరోయిన్స్ రేంజ్‌లో ఫాలోయింగ్‌ను దక్కించుకుంది. ముఖ్యంగా ఈమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో హీరోయిన్స్ రేంజ్‌లో ఫాలోవర్స్ సంఖ్య ఉంది. కనుక ఈ అమ్మడు సోషల్ మీడియాలో స్టార్ అయింది. అయితే హీరోయిన్‌గా మాత్రం ఆఫర్ల కోసం వెయిట్ చేస్తోంది. వెబ్ సిరీస్‌ల్లో, చిన్న సినిమాల్లో ప్రస్తుతం నటిస్తున్న ఈమెకు పెద్ద సినిమాల్లో, ప్రముఖ హీరోల సరసన నటించే అవకాశాలు దక్కడం లేదు, చిరంజీవి ఆఫర్ ఇస్తానంటూ హామీ ఇచ్చి, అన్నట్లుగానే ఛాన్స్ ఇచ్చారు. చిరంజీవి



ఇచ్చిన ఛాన్స్ ఆమె కెరీర్ కి పెద్దగా ఉపయోగపడలేదు. ప్రాముఖ్యత లేని పాత్ర ఇవ్వడంతో పాటు, నటించే స్కోప్ దక్కలేదు. చిరంజీవితో సన్నివేశాలకు ఛాన్స్ దక్కలేదు. ముందు ముందు అయినా ఈ అమ్మడికి టాలీవుడ్ లో పెద్ద హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు మరిన్ని వస్తాయా అనేది చూడాలి. తెలుగు అమ్మాయి కాకుంటే వరుసగా టాలీవుడ్‌లో హీరోయిన్ ఛాన్స్‌లు దక్కించుకునేంత అందం, ప్రతిభ ఉన్న దివికి ఇక్కడి అమ్మాయి కావడమే పెద్ద నేరం అన్నట్లుగా మారింది అంటూ ఆమె ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివికి ఉన్న అందంతో తెలుగులో కాకుండా ఇతర భాషల్లో ప్రయత్నిస్తే బాగుంటుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలతో వైరల్ అవుతోంది. ఈసారి పెద్దగా స్కిన్ షో చేయకుండానే ఆకట్టుకుంది. బ్లాక్ షర్ట్ ధరించి భలే ఉందే అనిపించింది. లూజ్ హెయిర్‌తో క్యూట్ లుక్ లో బ్లాక్ షర్ట్ తో డిఫరెంట్ లొకేషన్‌లో మేకప్ పెద్దగా లేకుండా తీసుకున్న ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోల్లో దివి చాలా బాగుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఈ ఫోటోలపై మీరు ఒక లుక్ వేయండి.

## చీరకట్టులో పాయల్.. వ్వాటే లుక్!

పాయల్ రాజ్‌పుత్ తన ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌తో ఎప్పటికప్పుడు అభిమానుల్ని అలరిస్తూ ఉంటుంది. ఎక్కువగా ఘాటైన గ్లామర్ తో ఆకట్టుకునే ఆమె ఈసారి చీరకట్టులో ఊహించని విధంగా దర్శనమిచ్చింది. అచ్చమైన తెలుగామ్మాయి తరహాలో పాయల్ చందమామలా మెరిసిపోతోంది. పర్పుల్ కలర్ చీర, ట్రెడిషనల్ జువెలరీలో ఆమె అందం మరింత హైలైట్ అవుతోంది. ఫోటోల్లో ఆమె స్టైల్, గ్లామర్ అన్నీ కలగలిపి ఒక అందమైన బుట్టబొమ్మలా కనిపిస్తోంది. ఇక పాయల్ రాజ్‌పుత్ తన కెరీర్‌ను పంజాబీ సినిమా 'చన్నా మేరియా'తో ప్రారంభించింది. కానీ '%=ఠ% 100' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. ఈ సినిమాలో ఆమె పోషించిన బోల్డ్ క్యారెక్టర్ ఆమెను నేరుగా టాప్ లిస్టులో చేరేలా చేసింది. తరువాత



ఆమె పలు సినిమాల్లో నటించినప్పటికీ, 'ఆర్ఎక్స్ 100'లాంటి విజయం అందుకోలేకపోయింది. 'వెంకీమామ', 'డిస్కో రాజా' వంటి సినిమాల్లో పర్ఫార్మెన్స్‌తో మెప్పించినప్పటికీ, కమర్షియల్ బ్రేక్ మాత్రం రాలేదు. ఇక మంగళవారం సినిమా మాత్రం మళ్ళీ కమర్షియల్ గా విజయాన్ని ఇచ్చింది. పాయల్ నిత్యం తన గ్లామర్ లుక్స్‌తో నెట్టింట రచ్చ చేస్తూ ఉంటుంది. సోషల్ మీడియాలో ఆమె పలు ఫోటోషూట్లను పోస్ట్ చేస్తూ ట్రెండ్ సెట్ చేస్తోంది. ముఖ్యంగా ఈ లేటెస్ట్ ఫోటోల్లో ఆమె ట్రెడిషనల్ లుక్ అందరి హృదయాలను దోచేస్తోంది.

పాయల్ చీరకట్టులో తెలుగుతనం ఉట్టిపడేలా కనిపిస్తుండటంతో నెటిజన్ల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం పాయల్ తనకు తగిన హిట్స్ కోసం ఎదురుచూస్తోంది. లేడీ ఓరియెంటెడ్ పాత్రలతో పాటు, మంచి కథలు ఎంచుకుని నటన పరంగా తనను నిరూపించుకోవాలని ఆమె ప్రయత్నిస్తోంది. ఆమె త్వరలోనే కొన్ని కొత్త ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఒక తమిళ సినిమాతో బిజీగా ఉన్నట్లు టాక్. మరి ఆ సినిమా అమ్మడికి ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.



# అదానీని అరెస్ట్ చేయాలి

## అదానీని అరెస్ట్ చేయాలి.. సెబీ చీఫ్‌ను విచారించాలి: రాహుల్ గాంధీ డిమాండ్

దిల్లీ: లంచం ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదైన అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీని తక్షణమే అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. సెబీ చీఫ్ మాధభి పురీ బచ్‌పైనా విచారణ జరిపించాలన్నారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా ప్రధాని మోదీపై మరోసారి విమర్శలు ఎక్కుపెట్టారు. అమెరికా, భారత చట్టాలను అదానీ ఉల్లంఘించారనే విషయంపై ఇప్పుడు స్పష్టత వచ్చిందని రాహుల్ గాంధీ అన్నారు. మోదీ, అదానీల బంధం భారత్‌లో ఉన్నంత వరకే సురక్షితమన్నారు. తాజా ఆరోపణలపై తక్షణమే జేపీసీతో విచారణ జరిపించాలన్నారు. శీతకాల సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామన్నారు. తన అవినీతి ద్వారా దేశ ఆస్తులన్నీ అదానీ కొల్లగొట్టారని ఆరోపించారు. ఆయనను వెంటనే అరెస్ట్ చేసి విచారిస్తే విషయాలన్నీ బయటపడతాయన్నారు. ఆయనను రక్షిస్తున్న సెబీ చీఫ్‌ను ఆ పదవి నుంచి తొలగించి ఆమె పైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లంచం ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా సంబంధం లేకుండా విచారణ జరిపించాలని రాహుల్ గాంధీ కోరారు. "అదానీ అరెస్టు కాదని, ఆయనపై విచారణ జరగదని నేను గ్యారంటీ ఇస్తాను. ఎందుకంటే ఆయన్ను మోదీ కాపాడుతున్నారు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు.

## నదులు కనుమరుగైతే మనిషి మనుగడే ప్రశ్నార్థకం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: నదుల వెంట నాగరికత వర్ధిల్లాలి.. వాటిని కనుమరుగయ్యేలా చేస్తే మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజారోగ్యం, పటిష్ఠ ఆర్థిక పర్యావరణ కోణాల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్‌కు మూసీ ఒక వరం కావాలి. కానీ శాపంగా మిగిలిపోకూడదు అని సీఎం సోషల్‌మీడియా వేదికగా స్పందించారు. మూసీ ప్రక్షాళన చేయాలన్నదే.. ప్రజా ప్రభుత్వ సంకల్పం అని ఆయన పేర్కొన్నారు. ఇది ఈ తరానికే కాదు.. భావితరాలకు మేలు చేసే నిర్ణయమని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి అండగా నిలిచే ప్రతి వ్యక్తికి, వ్యవస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల 'మూసీ పునరుజ్జీవం- ప్రక్షాళన' పేరుతో అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చివేస్తోంది. ఈనేపథ్యంలో పలువురి నుంచి సీఎం నిర్ణయం సరికాదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సోషల్‌మీడియాలో తనదైన శైలిలో స్పందించారు.

## రోగులకు 90శాతం చికిత్స మండల కేంద్రాల్లోనే జరగాలి: దామోదర రాజనర్సింహ



మంచిర్యాల: రోగులకు 90శాతం చికిత్స మండల కేంద్రాల్లోనే జరగాలని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రభుత్వ వైద్యులు రోగిని తమ క్లయింట్‌గా భావించాలని చెప్పారు. మంచిర్యాలలో రూ.360 కోట్లతో చేపట్టనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాజనర్సింహ మాట్లాడారు.
ఆస్పత్రిలో వైద్య సిబ్బంది అందుబాటులో లేరనే విమర్శ రావొద్దని వైద్యాధికారులకు సూచించారు. ఈ ప్రభుత్వం ఇప్పటికే 7 వేలకుపైగా నర్సు పోస్టులను భర్తీ చేసిందన్న ఆయన.. ప్రతి మండలానికి 2 అంబులెన్స్‌లు సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ట్రామా సెంటర్ ఉండేలా చర్యలు చేపడతామన్నారు.

## భిన్నత్వంలో ఏకత్వం.. మనదేశ గొప్పతనం: మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్: దక్షిణ భారతదేశంలోనే తొలిసారి తెలంగాణలో లోక్‌మంథన్ నిర్వహించడం గౌరవంగా ఉందని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు రుచులను అతిథులు ఆస్వాదించాలని మంత్రి కోరారు. భౌగోళికంగా, చారిత్రాత్మకంగా తెలంగాణను మినీ ఇండియాగా చెప్పుకుంటారని జూపల్లి వివరించారు. సాంకేతికత లేనప్పుడే గొప్ప కట్టడాలను రాష్ట్రంలో నిర్మించారన్నారు. భిన్నత్వంలో ఏకత్వం భారత దేశ గొప్పతనం అని.. ఇక్కడ ఉన్న విభిన్న సంస్కృతులను అతిథులు వీక్షించాలని మంత్రి సూచించారు. శిల్పారామంలో ఏర్పాటుచేసిన లోక్‌మంథన్‌లో జరిగే ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రజలందరూ తిలకించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. లోక్‌మంథన్ కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి 2500 మంది అతిథులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణ సామాజిక అంశాలపై చర్చ జరుగుతుందని కేంద్రమంత్రి తెలిపారు.

## వరుస ట్వీట్లతో ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్న కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 21: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్ల పరంపర కొనసాగుతూనే ఉంది. వరుస ట్వీట్లతో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు మాజీ మంత్రి. ఎక్కడా తగ్గేదేలే అన్నట్లు ప్రతీ సమస్యపై ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వానికి అనేక ప్రశ్నలు సంధిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై మాటల తూటాలు పేలుస్తూనే ఉన్నారు. తాజాగా గురుకుల పాఠశాలలో విద్యార్థుల పరిస్థితిపై, అదానికి తెలంగాణలో పెట్టుబడులకు అనుమతి ఇవ్వడంపై, అలాగే మహబూబ్‌నగర్ జిల్లా మానుకోటలో బీఆర్ఎస్ మహాధర్నాకు అనుమతి నిరాకరించడంపై ట్వీట్లు పెడుతూ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉందని, సరైన భోజన సౌకర్యంలేక అల్లాడిపోతున్నారన్నారు. విద్యార్థులకు అన్నం పెట్టలేని వారు.. మహిళలను కోటీశ్వరులను చేస్తారట అంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణలో విద్యార్థులు, రైతులు, నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందంటూ మాజీ మంత్రి ట్వీట్ చేశారు.
**కేటీఆర్ ట్వీట్లు ఇవే..** "తల్లికి బువ్వ పెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయించాడట! విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించలేని రేవంత్- మహిళలను కోటీశ్వరులను చేస్తాడట! రోజుకో గురుకుల పాఠశాలలో ఆహారం వికటించి విద్యార్థుల అస్వస్థత. ఎన్నడూ లేనిది గురుకుల పాఠశాలలలో ఇప్పటి వరకు 40 మందికి పైగా విద్యార్థులు మరణం. పిల్లలు పిట్టల్లా రాలుతుంటే దిద్దుబాటు చర్యలు తీసుకోకుండా వేదికల మీదికెక్కి పిట్టలదొర మాటలు చెబుతుండు. దవాఖానల్లో విద్యార్థులు. చెరసాలలో రైతన్నలు. ఆందోళనలో నిరుద్యోగులు. జాగో తెలంగాణ" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## బీఆర్ఎస్ ధర్నా ఎఫెక్ట్.. పోలీసుల దిగ్బంధంలో మహబూబాబాద్



మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రం పోలీసుల దిగ్బంధంలోకి వెళ్లిపోయింది. మానుకోట పట్టణంలో పోలీసుల కవాతుతో భయానక వాతావరణం నెలకొంది. ఎటు చూసినా పోలీసులతో పట్టణం ఖాకీ వనంలా మారిపోయింది. నేడు జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిం చే గిరిజన రైతు ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఇతర మండలాల నుంచి జిల్లా కేంద్రంలోకి ఎవరు రాకుండా పోలీసులు భారీ కేడ్లు పెట్టి వాహనాలను ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పట్టణ కేంద్రంలో అన్ని వీధుల్లో జిల్లా ఎస్పీ సుదీర్ రామనాథ్ కేకన్ ఆధ్వర్యంలో పోలీసుల బలగాలు కవాతు నిర్వహించాయి. కాగా, లగచర్లలో గిరిజనులపై దాడికి నిరసనగా బీఆర్ఎస్ ఆందోళనలకు పిలుపు నిచ్చింది. ఈ నేపథ్యంలో మహబూబాబాద్‌లో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టాలని నిర్ణయించగా ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ప్రజా పాలనలో కనీసం ధర్నా చేయడానికి కూడా అనుమతించిన ప్రభుత్వ తీరుపై పౌర సమాజం భగ్గుమంటున్నది. ఇలాంటి ధోరణులు ప్రజాస్వామ్యానికి మంచివి కాదని ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తీరును తప్పుబడుతున్నారు.



## కొండ సురేఖ వ్యాఖ్యలపై నాగార్జున కుటుంబం క్షోభించింది

హైదరాబాద్: అక్కినేని నాగచైతన్య, సమంత విడిపోవడానికి మాజీ మంత్రి కేటీఆర్ కారణమంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఎంతటి దుమారాన్ని రేపాయో అందరికీ తెలిసిందే. మంత్రి వ్యాఖ్యలను అక్కినేని నాగార్జున తీవ్రంగా ఖండించారు. సినీ ఇండస్ట్రీ మొత్తం మంత్రి వ్యాఖ్యలను తప్పుబట్టింది. చివరకు కొండా సురేఖ వ్యాఖ్యలపై నాంపల్లి కోర్టును ఆశ్రయించారు నాగార్జున. క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రోజు నాంపల్లి కోర్టులో పిటిషన్ విచారణ జరిగింది. ప్రొసిజర్ ప్రకారం పిటిషనర్ వాంగ్మూలాన్ని న్యాయస్థానం రికార్డు చేసింది. నాగార్జున స్టేట్‌మెంట్ తర్వాత సాక్షుల స్టేట్‌మెంట్‌లను రికార్డ్ చేసింది. అయితే.. మంత్రి కొండా సురేఖపై నాగార్జున పరువు నష్ట దావా వేశారు. పరువు నష్ట దావాలో ఇప్పటికే మంత్రి కొండా సురేఖ కౌంటర్ దాఖలు చేశారు. నాంపల్లి స్పెషల్ కోర్టులో న్యాయవాది గురుమిత్ సింగ్ కౌంటర్ దాఖలు చేశారు. కౌంటర్‌పై కొండా సురేఖ తరుపు న్యాయవాది ఈరోజు వాదనలు వినిపించారు.
**నాగార్జున కుటుంబం కుంగిపోయింది..** "కొండ సురేఖ నాగార్జునపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసింది. ఆ తర్వాత ట్విట్టర్‌లో క్షమాపణ కోరుతూ పోస్ట్ చేసింది. ట్విట్టర్‌లో మంత్రి కొండా సురేఖ పెట్టిన పోస్ట్‌ను కోర్ట్ ముందు నాగార్జున తరుపు న్యాయవాది అశోక్ రెడ్డి చదివి వినిపించారు. నా వ్యాఖ్యల పట్ల మీరు కానీ, మీ అభిమానులు కానీ మనస్తాపానికి గురైనట్లయితే బేషరతుగా నా వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నాను, అన్యద భావించవద్దని కొండా సురేఖ ట్విట్ చేసింది. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి ఇలాంటి కామెంట్స్ చేయడం సరైంది కాదు. కచ్చితంగా కొండా సురేఖ క్రిమినల్ చర్యలకు అర్హురాలు. ఈ కామెంట్స్‌తో నాగార్జున కుటుంబం మానసికంగా ఎంతో కుంగిపోయారు" అని నాగార్జున తరఫు న్యాయవాది అశోక్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు.
**నాగార్జున ఏమన్నారంటే..** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఆరోపణలు గుప్పిస్తూ.. అక్కినేని కుటుంబాన్ని ప్రస్తావించి మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై హీరో అక్కినేని నాగార్జున స్పందించారు. కొండా సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని ప్రకటించారు. "రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలను, మీ ప్రత్యర్థుల్ని విమర్శించేందుకు వాడుకోకండి. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలను గౌరవించండి. బాధ్యత కలిగిన పదవిలో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల మీరు చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం. తక్షణమే మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను" అని నాగార్జున అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. బాధ్యతగల మంత్రి పదవిలో ఉండి.. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధారమైన, అవాస్తవ వ్యాఖ్యలు చేసిన ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.
**ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్న కొండా సేరేఖ...** మరోవైపు.. తన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం చెలరేగిన నేపథ్యంలో.. ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు మంత్రి కొండా సురేఖ ప్రకటించిన విషయం తెలిసిందే. "అనుకోని సందర్భంలో.. అనుకోకుండా ఓ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా. కేటీఆర్ నన్ను కించపరిచే విధంగా మాట్లాడారు. ఆ మాటలతో వేదనకు గురై ఆయన గురించి వాఖ్యలు చేసే క్రమంలో అనుకోకుండా నాగార్జున కుటుంబం గురించి మాట్లాడా. ఆ వ్యాఖ్యలను నేను వెనక్కి తీసుకుంటున్నా. కానీ కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యల విషయంలో మాత్రం వెనక్కు తగ్గేది లేదు" అని కొండా సురేఖ స్పష్టం చేశారు.తాను వ్యాఖ్యలు చేసిన తర్వాత ఎక్స్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ఆ కుటుంబం ఆవేదనతో చేసిన పోస్టులు చూసి తనకు బాధ అనిపించిందని, ఆ కుటుంబాన్ని తన వ్యాఖ్యలు నొప్పించాయని తెలిసి బాధ పడ్డానని పేర్కొన్నారు. తాను పడిన బాధ వాళ్లు పడకూడదనే ఉద్దేశంతో.. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటూ తాను కూడా ఎక్స్‌లో పోస్టు చేశానని తెలిపారు. కేటీఆర్ తనను మరింత రెచ్చగొడుతున్నారని ఆమె మండిపడ్డారు. "కేటీఆర్‌కు నేను క్షమాపణ చెప్పడమేంటని.. ఆయనే నాకు క్షమాపణలు చెప్పాలి" అని డిమాండ్ చేశారు. దొంగే 'దొంగా దొంగా' అన్నట్టుగా కేటీఆర్ ప్రవర్తన ఉందని.. ఆయన తనపై పెట్టించిన పోస్టులన్నింటినీ తొలగించాలని దుయ్యబట్టారు. తన కంటే ముందు.. మంత్రి సీతక్కపై ఇంకా ఘోరంగా ట్రోల్ చేశారని ఆవేదన వెలిబుచ్చారు. మహిళలను ట్రోల్ చెయ్యొద్దని బీఆర్ఎస్‌కు హితవు పలికిన ఆమె.. "కేటీఆర్ నీకు మహిళలు పనికిమాలిన వాళ్లలా కనిపిస్తున్నారా? మీ కుటుంబ సభ్యులే మహిళలా? నీ నోరు ఏ యాసిడ్‌తో కడగాలి?" అంటూ నిప్పులు చెరిగారు.
**వారిని కేటీఆర్ దుబాయ్‌లో దాచి పెట్టారు..** తనను ట్రోల్ చేసినవారిని కేటీఆర్ దుబాయ్‌లో దాచి పెట్టారని ఆరోపించారు. వెంటనే వారిని తీసుకొచ్చి అప్పగించాలని డిమాండ్ చేశారు. సినీ పెద్దల స్పందన వెనుక బీఆర్ఎస్ నేతలు ఉన్నారో, లేదో తనకు తెలియదన్నారు. కేటీఆర్ ఇచ్చిన నోటీసులను తాను లీగల్‌గా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతండడంతో పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. దీనిపై వివరణ ఇవ్వాలని సురేఖకు సూచించారు. దీంతో తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నట్లు కొండా సురేఖ ట్వీట్ చేశారు. "నా వ్యాఖ్యల ఉద్దేశం మహిళల పట్ల ఒక నాయకుడి ధోరణిని ప్రశ్నించడమే తప్ప.. సమంతా, మీ మనోభావాలను దెబ్బతీయడం కాదు" అని స్పష్టం చేశారు. "స్వయం శక్తితో మీరు ఎదిగిన తీరు నాకు కేవలం అభిమానమే కాదు.. ఆదర్శం కూడా" అని మంత్రి కొండా సురేఖ వెల్లడించారు.

## అన్నింటిలో కాంగ్రెస్ సర్కార్ విఫలం.. హరీష్ విసుర్లు



సంగారెడ్డి జిల్లా, నవంబర్ 21: సీఎం రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్‌రావు ఘాటు విమర్శలు చేశారు. గురువారం అందోల్ మండలం మాసాన్ పల్లీ గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రేవంత్ రెడ్డి రైతులకు తొమ్మిది హామీలను అమలు చేస్తామని ప్రకటించారని.. ఇందులో ఏ ఒక్క హామీనైనా నెరవేర్చగలిగారా అంటూ విమర్శలు గుప్పించారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోలులో పూర్తిగా విఫలమైందని వ్యాఖ్యలు చేశారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో, పెట్టుబడి సాయం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారన్నారు. మరోపక్క సివిల్ సప్లై కమిషనర్ 70 లక్షల మెట్రిట్ టన్నుల ధాన్యాన్ని కొంటామని ప్రకటించడం పట్ల ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మధ్యలో 20 లక్షల మెట్రో టన్నుల ధాన్యం ఎక్కడికి పోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన సగం ధాన్యం దళారుల పాలయిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దళిత గిరిజన అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం కొల్లగొడుతోందని విమర్శించారు. కంపెనీ నిర్మాణాల కోసం ఆ భూములను తమ అనుయాయులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. బ్లాక్మెయిల్ రాజకీయాలకు సీఎం తెరలేపుతున్నారన్నారు. రంగనాయక సాగర్ దగ్గర ఇరిగేషన్ భూములను కబ్జా చేశానని తనపై రేవంత్ రెడ్డి తప్పుడు ఆరోపణ చేశారని తెలిపారు. పచ్చకామర్ల వాడికి లోకమంతా పచ్చగా అన్నట్లు కబ్జాలు చేసే చరిత్ర రేవంత్ ది అంటూ వ్యాఖ్యలు చేశారు. రైతుల పట్టా భూములను ధరణి ద్వారా 13 ఎకరాలు కొని రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందన్నారు. "ఒక గుంట కానీ, ఒక ఎకరా కానీ ఇరిగేషన్ భూమి కానీ, ప్రభుత్వ భూమి కానీ తీసుకున్నట్టు నా చరిత్రలో లేదు. ఏ భూమిని అయితే నేను రిజిస్ట్రేషన్ చేసుకున్నానో ఆ భూమిలోనే నేను కబ్జాలో ఉన్నాను. నువ్వు ఎప్పుడు వస్తావు రా రేవంత్ రెడ్డి. నీ సమక్షంలోనే సర్వే చేద్దాం" అంటూ హరీష్ రావు సవాల్ విసిరారు. ఎన్ని బ్లాక్ మెయిల్ చేసిన భయపడేది లేదని.. బీఆర్ఎస్ పార్టీ తరపున రైతుల పక్షాన రేవంత్‌ను ప్రశ్నిస్తూనే ఉంటామని హరీష్ రావు స్పష్టం చేశారు.

## వారు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు.. భట్టి విక్రమార్క వార్నింగ్



హైదరాబాద్: కుల గణనపై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. కుల గణన అడ్డుకోవాలని కొందరు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కొందరు దోపిడీ దారులు కులగణనపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎందరు కుట్ర చేసినా కుల గణనను విజయవంతం చేస్తామని అన్నారు. ఇవాళ గాంధీభవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ప్రజలతో మమేకం అవుతూ ప్రజల సమస్యలు తెలుసుంటుందని.. ముఖాముఖీ కార్యక్రమానికి రావడం జరిగిందని అన్నారు. ప్రజావాణితో పాటు.. పార్టీ భావజాలన్ని నమ్మి.. ఓటేసిన ప్రజల అభిప్రాయాలను, ఇబ్బందులను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం తీసుకున్నామని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం ఎప్పుడు గడిల మధ్య ఉండి పాలన చేసిందని విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రజా పాలన చేస్తుందని ఉద్ఘాటించారు. విద్య, వైద్యం మీద ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టీ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా..డైట్ చార్జీలు 40శాతం పెంచి అందిస్తున్నామని చెప్పారు..చాలా పథకాలతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు.
**ఉద్యోగాలు కల్పించేలా చర్యలు..** "రాష్ట్ర సాధనే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు..ప్రభుత్వం రాగానే టీజీపీఎస్సీ ప్రక్షాళన చేసి.. 50వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. పదేళ్లలో గ్రూప్- 1 పరీక్షలు సరిగ్గా నిర్వహించాలేక గాలి వదిలేశారు. బీఆర్ఎస్ నేతల కుటిల ప్రయత్నాలను తట్టుకొని ఉద్యోగాల భర్తీ చేస్తున్నాం. మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ.. ఆ వడ్డీనీ సైతం ప్రభుత్వం కట్టనుంది. మహిళ సంఘాలతో వెయ్యి మెగా ఓల్ట్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం చేసుకున్నాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుంది. 60 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ముందుకు వెళ్లేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాం. ఇది పేద బడుగు బలహీన వర్గాల ప్రభుత్వం. కుల గణన చారిత్రాత్మక విజయం. దేశానికి తెలంగాణ మోడల్‌గా కుల గణన నడుస్తుంది. కుల గణనను అడ్డుకోవాలని దోపిడీ దారులు ప్రయత్నం చేస్తున్నారు. వనరులు ప్రజలకు సమానంగా పంచాలని కోరుకునే వారు కుల గణనకు మద్దతు తెలపాలి" అని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com